J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 7 18.7.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# దారి తప్పుతున్న జనసేన



- నిఖార్సుగా ఉన్న నాయకుడు
- అత్యాచారాలు, హత్య కేసులతో పక్కదారి పడుతున్న సైన్యం
- తలనొప్పులు, తలవంపులతో తలమునకలు
- మేలుకోకుంటే మొదటికే మోసం అంటున్న విశ్లేషకులు

**'జనసేన' సాంప్రదాయ మూస రాజకీయ సిద్ధాంతాలను పక్కన పెట్టిన పార్టీ. పేదవాడు తలెత్తుకునేలా పిడికిలి బిగించి అన్యాయాన్ని ప్రశ్నించడమే ధ్యేయంగా ఏర్పాటైన పార్టీ. కుల రహిత, మత రహిత సమాజం కోసం శ్రమిస్తామని ప్రకటించిన పార్టీ. బలహీనుడిపై బలంగా పనిచేసే చట్టం, అందరికీ సమానంగా వర్తించాలని తపించే పార్టీ. దశాబ్దకాలంగా అధికారం దక్కకున్నా, విలువలకు కట్టుబడి ముందుకు నడిచిన పార్టీ. అధినేత కష్టించి సంపాదించిన సొమ్మును కౌలు రైతులకు పరిహారంగా అందించిన పార్టీ. ఇంతటి విశిష్టత, నిబద్ధత, కలిగిన నాయకుడు నడిపిస్తున్న పార్టీ జనసేన.**

అలాంటి జనసేన పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు ద్వితీయ శ్రేణి నాయకుల చిల్లరచేష్టల కారణంగా ప్రజల్లో పలుచనవుతోంది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఇసుక దందాలు, అభివృద్ధి పనుల్లో చేతివాటం, రేషన్ బియ్యం తరలింపు వంటి కేసుల్లో నిందితులుగా ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు తమ పేర్లను లిఖించుకున్నారు. తాజాగా మరికొందరు హత్యలు, అత్యాచారాలు, లైంగిక వేధింపుల కేసుల్లో చిక్కుకుని పార్టీకి మాయని మచ్చ తెస్తున్నారు. ఇటీవల శ్రీకాళహస్తి జనసేన ఇన్‌ఛార్జి కోట వినుత తన డ్రైవర్ హత్య కేసులో చిక్కుకోవడంతో కొందరు జనసేన నాయకుల దాష్టీకాలపై చర్చ మరింత జోరందుకుంది.

## ఆశయాలు ఘనం..

2014 మార్చి14న పురుడు పోసుకున్న జనసేన పార్టీ తన ప్రస్థానంలో ఎన్నో ఎత్తు పల్లాలు చూసింది. 2014 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకున్నా, తెలుగుదేశం, బీజేపీ కూటమికి మద్దతిచ్చింది. ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించి అప్పట్లో టీడీపీ, బీజేపీ విజయానికి శ్రమించారు. తర్వాత 2019లో సొంతంగా పోటీచేసి ఒక్క సీటుకే పరిమితమైంది. ఇక 2024 ఎన్నికల్లో 21చోట్ల పోటీచేసి 100 శాతం స్ట్రైక్‌రేట్‌తో ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో పార్టీని నడిపించేందుకు పవన్ తన సర్వశక్తులూ ఒడ్డారు. కష్ట సమయాల్లో పార్టీ శ్రేణులు ఆత్మస్థైర్యం

10లో



జననం : 16.10.1930 నిర్యాణం : 20.07.2019

# 6వ వర్ధంతి



## శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారు

(స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి సతీమణి)

పరమపదించి జులై 20, 2025 నాటికి

ఆరేళ్ళు పూర్తవుతున్న సందర్భంగా...

**ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...**

- కుటుంబసభ్యులు

ప్రపంచంలోనే అత్యాధునిక సౌకర్యాలున్న అమెరికా వంటి పాశాత్య దేశాల్లో పెళ్లి ఎంత సింపుల్‌గా చేసుకుంటారో, విడాకులు కూడా అంతే సింపుల్‌గా ఇచ్చేస్తుంటారు. ఇదంతా నిన్నటి మాట.. ప్రస్తుతం మనదేశంలో కూడా మూడురోజులపెళ్లిళ్ళుపోయి.. మూడు గంటల పెళ్ళిల్లొచ్చాయి. చివరికి ఉంగరాలు మార్చేసుకుంటే చాలు అనే స్థాయికి చేరిపోయాయి. పైగా కొన్నిసార్లు అవి విడాకులతో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. అక్రమ సంబంధాలు, ఆర్థిక వ్యవహారాలు ఇందుకు ప్రధాన కారణంగా ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రహస్యంగా చిత్రీకరించిన వీడియోలు, ఆడియో రికార్డులు సైతం విడాకులకు సాక్ష్యంగా పరిగణిస్తామని తాజాగా సుప్రీం కోర్టు ప్రకటించింది. హర్యానలోని ఓ జంటకు సంబంధించిన కేసులో తీర్పిస్తూ.. ఒకరికి తెలియకుండా ఒకరు చిత్రీకరించిన రికార్డులను సైతం ఎవిడెన్స్‌గా ఉపయోగించవచ్చని తేల్చిచెప్పింది. దీంతో దేశంలో విడాకుల సంఖ్య మరింతగా పెరిగే ప్రమాదం ఉందని మానసిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఇద్దరి మధ్య కనీస స్థాయిలో నమ్మకం లేనప్పుడే రహస్యంగా సాక్ష్యాలు సేకరించే పరిస్థితి నెలకొంటోంది. మరి అలాంటప్పుడు రికార్డుల వల్లే దంపతుల మధ్య మరింత అపోహలు పెరుగుతాయని సందేహపడడం సహేతుకం కాదని అత్యున్నత ధర్మాసనం అభిప్రాయపడడం గమనార్హం.



# మూన్నాళ్ళ ముచ్చటగా..
# మూడుముళ్ళ బంధం!

- ☞ దేశంలో విషమిస్తున్న విడాకుల సంస్కృతి
- ☞ ఎక్కువౌతున్న పాశ్చాత్య పోకడలు
- ☞ అవగాహనే ప్రధానం అంటున్న నిపుణులు
- ☞ రహస్య రికార్డింగులూ విడాకులకు సాక్ష్యాలే :సుప్రీంకోర్టు

పెళ్లి.. ఇద్దరు మనుషులను ఏకం చేసేదే కాదు. రెండు మనసులను ఒక్కటిగా చేసి జీవిత గమనాన్ని నిర్దేశించే పవిత్రమైన కార్యం. ద్రవిడులు, వేదకాలం నుంచే భారతీయ ఆచార వ్యవహారాలు, సంప్రదాయాల్లో వివాహానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. పెళ్లిచూపుల దగ్గర నుంచి ఆహ్వాన పత్రికలు సహా వివాహ తంతు పూర్తయ్యేవరకు ఇరు కుటుంబసభ్యులు ఎన్నో విషయాలను పంచుకుంటూ అనుబంధం పెంచుకుంటారు. సంబంధాలను కలుపుకుంటారు. తద్వారా తమ బలగాన్ని బలిష్టం చేసుకుంటారు. ఇక దంపతులు సైతం తాము సుఖంగా, సంతోషంగా కలిసి ఉండడమే కాకుండా రెండు కుటుంబాల మధ్య వారధిగా ఉంటూ వారితో కొత్త బంధాలకు ప్రాణం పోస్తారు. ఈ క్రమంలో శుభకార్యాల, విందులు, వినోదాలు, గెట్‌టూ గెదర్‌లు, వన భోజనాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. వివాహానికి ఇంత ప్రాముఖ్యత ఉన్న నేపథ్యంలో సంసార నావను దరికి చేర్చాలన్నా.. కుటుంబమనే బండి ముందుకు నడవాలన్నా భార్యా భర్తల మధ్య సఖ్యత ముఖ్యం. పిల్లల భవిష్యత్‌కు కూడా ఇది ప్రధానం. అయితే ఇటీవల మన దేశంలో విడాకుల కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కర్ణుడిచావుకు సవాలక్ష కారణాలన్నట్లు ఈ విషయంలో చాలా అంశాలే ప్రభావం చూపుతున్నాయి.

## ప్రపంచంలోనే ఆదర్శం..

బాజాభజంత్రీలు, గానాబజానాలు.. సమష్టి భోజనాలే కాకుండా సంప్రదాయ పస్త్రాలు, తాంబూలాల మార్పు, కలశం, జీలకర్రా బెల్లం, తలంబ్రాలు, మూడుముళ్లు , ఏడడుగులు , అక్షింతలు.. పెద్దల దీవెనలు వంటి ఎన్నో తతంగాలకు వేదికైన భారతీయ వివాహ వ్యవస్థకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరుంది. అలాంటి మన దేశంలో ప్రస్తుతం విడాకులు తీసుకునే వారి సంఖ్యరోజురోజుకూ పెరుగుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రస్తుతం విడాకుల ట్రెండ్ నడుస్తోంది. చెప్పుకోవడానికి కారణాలు చాలా చిన్నవిగా వింతగా అనిపించినా, ఈ విషయంలో కోర్టు మెట్లెక్కుతున్న వారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. ఇందులోనూ చదువుకున్న వారే ఎక్కువగా ఉంటున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం, మారుతున్న సామాజిక పరిస్థితులు, తానే గొప్ప అనే ధోరణులు ఇలా.. విడిపోవడానికి ఎన్నో కారణాలు కనిపిస్తున్నాయి.

## సెలబ్రెటీలతో మొదలై..

మనదేశంలో అత్యంత పాపులర్ రంగాలుగా క్రికెట్, రాజకీయాలు, సినిమా గుర్తిపు పొందాయి. ఈ రంగాల్లోని సెలబ్రెటీలు స్టార్ స్టేటస్‌ను అనుభవిస్తూ ప్రజలపై తమ చర్యల ద్వారా ప్రభావం చూపుతుంటారు. ఈనేపథ్యంలో సెలబ్రెటీల జీవితాల్లో పాశ్చత్య పోకడలు ఎక్కువై విడాకులు, సహజీవనం సాధారణ విషయాలుగా మారిపోయాయి. ఈ వ్యవహారాలకు మీడియా అధిక ప్రాధాన్యం ఇస్తుంటుంది. ఫలితంగా ప్రజల్లో తరచూ అవి చర్చనీయాంశాలుగా మారుతుంటాయి. దీంతో సామాన్యుల్లోనూ విడాకుల సంస్కృతి ఎక్కువై అది చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఇటీవల టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, తాజాగా బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ విడాకుల బాటలోనే ప్రయాణిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.

## కారణాలు ఇవే..

ప్రస్తుతం మనదేశంలో వర్క్ కల్చర్ పూర్తిగా మారిపోయింది. ఉదాహరణకు అనేక రంగాల్లోని ఉద్యోగులు గంటల తరబడి పనిచేయడం, కంప్యూటర్‌కే పరిమితం కావడం, సోషల్ మీడియా ఎడిక్షన్స్ వంటివన్నీ విడాకులకు దారితీస్తున్నాయి. చాలామంది తిండిని ఆర్డర్ పెట్టుకునేందుకు కూడా వాట్సాప్, స్విగ్గి, జొమోటో అంటూ యాప్‌లనే ఆశ్రయిస్తుండడం మారుతున్న సమాజానికి నిదర్శంగా కనిపిస్తున్నాయి. ఇక ఫోన్ కూడా వివాహ వ్యవస్థ విచ్ఛిన్నానికి ప్రధాన కారణమవుతోంది. ఫోన్‌కు పర్సనల్ పాస్‌వర్డ్ పెట్టుకోవడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో గంటల తరబడి ఇతరులతో చాట్ చేయడం వంటివి భాగస్వామితో సత్సంబంధాలు నెరపలేకపోవడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. ఇక ఇష్టంలేని పెళ్లి, ఆర్థిక సమస్యలు, విలాసవంతమైన జీవితం కావాలనే కోరికలు వీటికి అదనంగా వచ్చి చేరుతున్నాయి.

## ఈగోతో మొదలై..
## వ్యక్తిగత ద్వేషం వరకు..

ప్రస్తుత కాలంలో దంపతులిద్దరూ చదువుకున్న వారు కావడం, ఉద్యోగాలు చేస్తుండడం, ఆర్థిక స్థిరత్వం కలిగి ఉండడంతో ప్రతి విషయంలో ఆత్మాభిమానం పేరుతో సొంత అభిప్రాయాలను ఏర్పరుచుకుంటున్నారు. ఫలితంగా కుటుంబ విషయాల్లో సఖ్యత, సమష్టితత్వం లోపిస్తున్నాయి. అలాగే కొన్ని చోట్ల స్నేహితులు కూడా భార్యాభర్తల విషయంలో యముళ్లుగా మారుతున్నారు. స్నేహం పేరుతో హద్దు మీరి ప్రవర్తిస్తుండడం, ఇతరుల విషయంలో అతి జోక్యం చేసుకోవడం వల్ల దంపతుల మధ్య గొడవలకు కారణమౌతోంది. కొన్నిసార్లు అది అనుమానంగా మారి నీతో సంబంధం అక్కరలేదు అనే స్థాయికి చేరిపోతోంది. విడాకుల తర్వాత కూడా కొందరు బద్ధశత్రువుల తరహాలో వ్యవహరిస్తుండడమే ఇందుకు ఊదాహరణ.

## వ్యసనాలు.. వ్యాధులు కూడా..

కొందరిలో పొగతాగడం, మద్యం తీసుకోవడం లాంటి దురలవాట్లు ఎక్కువగా ఉంటాయి. ఆడవాళ్లు కూడా ఇందుకు అతీతం కాదనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫలితంగా భాగస్వామి వ్యవహార శైలి, అలవాట్లు మరొకరికి ఇబ్బందికరంగా పరిణమిస్తున్నాయి. ఇక చాలా మందిలో ప్రస్తుతం డయాబెటీస్ సమస్య సర్వసాధారణంగా మారింది. షుగర్ సమస్యలున్న వారిలో నిస్సత్తువ, నీరసం ఆవహించి ఏ విషయంలోనూ ఉత్సాహంగా ఉండడం లేదనే వాదనలూ వినిపిస్తున్నాయి. అలాగే కొంతమందిలో లైంగిక సమస్యలు కూడా విడాకులకు, అక్రమ సంబంధాలకు కారణవుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## గృహ హింస, కట్నం వేధింపులు

ఇక కొందరు అత్యాశకు పోయి అదనపు కట్నం ఆశిస్తుండడం, ఉద్యోగాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటూ భాగస్వామిని నిత్యం వేధిస్తుండడం కూడా విడాకుల సమస్యకు ఓ కారణంగా కనిపిస్తోంది. గతంలో మద్యం తాగొచ్చి భర్త గొడవ చేస్తున్నా పెద్దల భయంతోనో, బిడ్డల కోసమో భార్యలు వాటిని భరిస్తూ వచ్చేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పైగా మహిళలే తమ కోర్కెల కోసం భర్తలను వేధించుకు తింటున్నారనే వాదనలూ వినిపిస్తున్నాయి. ఫలితంగా అవి గృహహింసగా మారి కౌన్సెలింగ్ సెంటర్లు, పోలీస్ పంచాయితీ వరకు వెళ్లే పరిస్థితి నెలకొంటోంది. ఇక ప్రభుత్వాలు కూడా భార్యాభర్తలు విడిపోకుండా వారికి కౌన్సెలింగ్ ఇచ్చే చర్యలు చేపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సఖీ వన్‌స్టాప్ సెంటర్ల ద్వారా భార్యాభర్తలకు సూచనలిస్తూ వారిని మళ్లీ కలిసి ఉండేలా చొరవ చూపుతోంది. వీటిద్వారా నీది-నాది అనే భావనను తొలగించి మనది అనే భావనను పెంపొందించుకునేలా యత్నిస్తోంది.

## చట్టం ఏం చెబుతోంది.?

ఓ జంట విడాకులు కోరటానికి అనేక కారణాలున్న నేపథ్యంలో చట్టం ఈ విషయంలో ఎలాంటి సూచనలిస్తుంది..? ఎలాంటి వెసులుబాటు కల్పిస్తోందనే అంశం ప్రస్తుతం ఎక్కువగా తెరమీదకు వస్తోంది. హిందూ వివాహ చట్టం 1955 ప్రకారం కలిసి జీవించే పరిస్థితి లేనప్పుడు భార్య లేదా భర్త తమ వివాహాన్ని రద్దు చేసుకునే అవకాశం కల్పిస్తోంది.



## మార్పు రావాలంటే..
## ఇవి పాటించాల్సిందే!

గతంలో కులం, మతం ప్రాతిపదికన పెళ్లిళ్ళు జరిగేవి. కానీ ప్రస్తుతం కులాంతర, మతాంతర వివాహాలు ఎక్కువౌతున్నాయి. ఈనేపథ్యంలో యువత ఆకర్షణకు, వ్యామోహానికి, ప్రేమకు ఉండే తేడాను గుర్తించాల్సి ఉంటుంది. ఈక్రమంలో అన్ని అంశాలను బేరీజు వేసుకున్న తర్వాతే పెళ్లికి సిద్ధపడాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇక పెద్దలు కుదిర్చిన సంబంధాల్లో సంప్రదాయాలు, ఆచారాల పేరుతో కట్నాలు, కానుకలు, లాంఛనాలు అధికంగా తీసుకుంటే తర్వాత వచ్చే సమస్యలు కూడా అదే స్థాయిలో ఉంటాయనే విషయాన్ని గుర్తించుకోవాలి. దీనికోసం పెళ్లికి ముందే సామాజిక, ఆర్థిక అంశాలతో పాటు వధువు, వరుడి గుణగణాలను పూర్తిగా తెలుసుకోవాలి. అలాగే వధువు, వరుడి ఆరోగ్య పరిస్థితులు ఎలా ఉన్నాయి. వారి మానసికస్థితి, పరిణితి ఏస్థాయిలో ఉన్నాయి అనేది పరిశీలించాలి. ప్రభుత్వాలు కూడా కుటుంబ వ్యవస్థ గొప్పదానాన్ని చిన్నతనం నుంచి పాఠ్యాంశాలుగా బోధించాల్సిన అవసరం ఉంది. ఏదేమైనా.. ఎవరు ఎన్ని చెప్పినా.. జీవితంలోని ఇతర విషయాల్లో గోల్డ్ మెడల్ సాధించడం కన్నా.. గోల్డ్ మెడల్ లాంటి భర్తనో.. భార్యనో పొందడం.. వారికి జీవితాంతం తోడుండడం ప్రశాంతమైన, సుఖమయ జీవితానికి అత్యంత ముఖ్యమనే విషయాన్ని అందరూ తెలుసుకోవాలి. అప్పుడే పెళ్లిళ్లు పదికాలాల పాటు నిలిచి ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు.

– బాలుబాబు

# ప్రసన్నకి ముందస్తు బెయిలు..ఇవ్వలేం!



## • హైకోర్టు స్పష్టీకరణ

**కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని నోటికొచ్చినట్లు అనుచితంగా మాట్లాడిన వైకాపా నేత, మాజీఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముందస్తు బెయిలు కోసం హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఈనెల16న (రెండోరోజున) జరిగిన విచారణలో ప్రసన్నకి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది.**

ప్రసన్నకుమార్‌రెడ్డి తనను అసభ్యంగా దూషించారని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేయడం, దాంతో కోవూరు పోలీసులు ఆయనపై కేసు పెట్టడంతో, ముందస్తు బెయిల్ కోసం ప్రసన్న హైకోర్టును కోరారు. ఈ విషయమై ప్రసన్న తరఫు న్యాయవాది మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో ఆమె అనుచరులు ప్రసన్న ఇంటిని ధ్వంసం చేశారని, దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసులు పెట్టలేదని ఆయన ఈ సందర్భంగా హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రసన్నపై పెట్టిన సెక్షన్లు ఆయనకు వర్తించవని, ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఈ వ్యవహారంపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా పిటిషనర్ అనుచితవ్యాఖ్యలు చేశారని, ఆ తర్వాత రోజు కూడా తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ మరో వీడియో విడుదల చేశారని తెలిపారు. ఆ వాదనలన్నిటినీ పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రసన్నకుమార్‌రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేయలేమని ప్రకటించింది. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో ఇతరుల మనోభావాలు, ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడడానికి వీలు లేదని, ఈ విషయంలో గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించి, నిందితుడిని అరెస్ట్ చేయాలా వద్దా అనే అంశం దర్యాప్తు అధికారి విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుందని హైకోర్టు వివరించింది. ఆర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలని దర్యాప్తు అధికారిని ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చింది.

## మెట్టప్రాంత యువతకి..

# ఇక బంగారు భవిత

## ఆగస్టులో మెగా జాబ్ మేళా.. 1400 మంది యువతకు ఉద్యోగాలు

### - మంత్రి ఆనం వెల్లడి

జిల్లాలో ఎంతోకాలంగా అభివృద్ధిలో వెనుకబడి ఉన్న మెట్ట ప్రాంతాలైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని నిరుద్యోగ యువత బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంకల్పించారు. ఆగస్టు 1, 2 తేదీల్లో ఆత్మకూరులో మెగా జాబ్‌మేళాకు భారీ సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 16న మర్రిపాడు మండలంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలసి, సుమారు 5 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి ఆనం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపకులు చేశారు. తొలుత మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఆర్ఐ కొర్రపాటి ప్రియా దంపతుల సహకారంతో ఏర్పాటు చేసిన శంకర్ నేత్రాలయ వారి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని, మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ బస్సులను మంత్రి ఆనం, ఎమ్మెల్యే సురేష్ ప్రారంభించారు. మర్రిపాడులో 95 లక్షలతో జల్‌జీవన్ మిషన్ పనులు వగైనా అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో



మాట్లాడుతూ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనల మేరకు యువతకు పెద్దఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1, 2 తేదీల్లో ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో మెగా జాబ్‌మేళాకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఇప్పటికే సుమారు 30 జాతీయ స్థాయి కంపెనీలు జాబ్ మేళాకు వస్తున్నాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా నిరుద్యోగ యువత తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రి సూచించారు. జాబ్ మేళాలో అభ్యర్థుల అర్హతల మేరకు తక్షణమే ఉద్యోగ నియమాక ఉత్తర్వులు ఇస్తారని, సుమారు 1400 మంది వరకు ఉద్యోగాలను ఇచ్చేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ చదివిన యువత అందరూ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం జాబ్‌మేళా రిజిస్ట్రేషన్లకు సంబంధించి క్యూఆర్ కోడ్‌ను మంత్రి ఆవిష్కరించారు.

## డా.కిషోర్స్ రత్నం హైస్కూల్‌లో..

# ప్రపంచ జనాభా దినోత్సవం




ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఇటీవల నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం హైస్కూలులో విద్యార్థులకు జనాభా పెరుగుదలపై అవగాహన కలిగించారు. అధికజనాభా వరమా?.. శాపమా? ప్రపంచ జనాభా పెరిగితే భూమికి ఎంత భారమో..వంటి అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సందేశాత్మకమైన ప్లకార్డులను చేతపట్టి ర్యాలీ చేశారు. ఉపాధ్యాయులు 'మన భూమిని మనం కాపాడుకుందాం' అనే అంశాన్ని విద్యార్థులకు వివరించారు. స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ, డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థలు విద్యార్థుల్లో అవగాహన కలిగించేందుకు, తద్వారా వారు పురోగతిని సాధించేందుకు తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలపై..19న సమావేశం

## • రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

రానున్న వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం కోసం అధికారులతో ముందస్తు కార్యాచరణ రూపొందిస్తామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు భయ్యా వాసు,అధ్యక్షులు సత్యనాగేశ్వర రావు, ప్రధానకార్యదర్శి పి.సురేంద్రరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు వేలూరు మహేష్ తదితరుల ఆధ్వర్యంలో తనను కలసిన ప్రతినిధి బృందంతో ఎమ్మెల్యే మాట్లాడారు. సెప్టెంబర్ 27వ తేదీ నుంచి జరగబోయే వినాయక చవితి ఉత్సవాల కోసం భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు వారు ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలకు గత సంవత్సరం కంటే మెరుగైన ఏర్పాట్లను చేసేందుకు మున్సిపల్ కార్పొరేషన్‌ను, నీటిపారుదల శాఖ, విద్యుత్, పోలీసు అధికారులు, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి ఈనెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు మూలపేట నెల్లూరు చెరువు వద్దనున్న ఎన్టీఆర్ నక్లెస్‌రోడ్, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం గణేష్ ఘాట్ వద్ద



ముందస్తు సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఏవిఆర్ మోహన్ రావు, శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు కప్పిర శ్రీనివాసులు, మండ్ల ఈశ్వరయ్య, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, కె.మదన్‌కుమార్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి మోసాలను..ప్రజలకు వివరిస్తాం!

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేస్తామని వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 16న వెంకటగిరిలోని ఆయన నివాసంలో జరిగిన వైకాపా నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ', "రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం గురించి వివరించారు. సాధ్యం కాని హామీలిచ్చిన చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని, అధికారం చేపట్టి 13 నెలలవుతున్నా, తూతూమంత్రంగా ఒక్క గ్యాస్ సిలిండర్, అరకొరగా తల్లికి వందనం మినహా చేసిందేమీ లేదని విమర్శించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ భానుప్రియ, వైస్‌ఛైర్మన్ ఎస్.బాలయ్య, రూరల్ మండలం వైకాపా కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అనాలోచిత నిర్ణయాలు!

## వైకాపా నేత పర్వతరెడ్డి విమర్శ



గత వైకాపా ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని మంత్రి నారాయణ అనాలోచిత నిర్ణయాలతో ధ్వంసం చేస్తున్నారంటూ ఎమ్మెల్సీ, వైకాపా నగర ఇన్‌ఛార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు.

ఇటీవల ఆయన స్థానిక వైకాపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, నెల్లూరులోని జాఫర్‌సాహెబ్ కెనాల్‌పై పర్యావరణాన్ని దెబ్బతీసే కూటమి సర్కారు చర్యలకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అడ్డుకట్ట వేసిందన్నారు. ఆ కెనాల్‌ను వైకాపా ప్రభుత్వ హయాంలో 120 కోట్లతో సుందరీకరించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కెనాల్‌పై 200 షాపుల ఏర్పాటుకు చర్యలు చేపట్టారని, అందువల్ల ట్రాఫిక్ సమస్యలు కూడా ఏర్పడతాయన్నారు. దుకాణాల ఏర్పాటు వల్ల కెనాల్‌లో వ్యర్థాలు పేరుకుపోతాయన్నారు. దాని నిర్మాణపు పనులను పూర్తిచేసే విషయాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దానిని అక్కడున్నవారిలో అధికశాతం మంది వ్యతిరేకిస్తున్నారని, సర్వే చేయిస్తే ఆ విషయం మీకు కూడా తెలుస్తుందని ఆయన అన్నారు. గత ఎన్నికల్లో తమ కోసం పనిచేసిన వారికి ఆ దుకాణాలు కేటాయించాలని మంత్రి భావిస్తుండడం సరైనది కాదన్నారు. అయితే, దుకాణాల ఏర్పాటుకు తామేమీ వ్యతిరేకం కాదని, ఆ కెనాల్ కలుషితమై పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉంది కనుక, ఆ విషయాన్ని తాము నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్ళగా, దీనిపై నివేదిక ఇవ్వాలని ట్రిబ్యునల్ ఆదేశించిందని ఆయన తెలిపారు. కమిటీ నివేదిక మేరకు షాపుల కేటాయింపును ఆపాలని ఆ కమిటీ ఉత్తర్వులు జారీచేసిందని ఆయన వెల్లడించారు.

లాయర్
జులై 18, 2025

# భూసారం లేక..పంటలు నిస్సారం!

మనిషికి బాగా లేకపోతే వైద్యుడి చేత ఆరోగ్యపరీక్షలు చేయించుకుని, ఏ మందులు వాడాలో వాడితే ఆరోగ్యం కుదుటపడుతుంది. లేకుంటే, అనారోగ్యంతో నానా బాధలు పడాల్సి వస్తుంది. ఇప్పుడు మనదేశంలోని భూమి పరిస్థితి కూడా ఇదే. నేల ఆరోగ్యంగా లేకుంటే, దాంట్లో వేసే పంటలు నాణ్యత కోల్పోతాయి. పోషకాలు అందని ఫలితంగా భూమి నిస్సారమై పోవడమే కాక, ఆ పంటలు వినియోగించుకునేవారికీ నిస్సత్తువ ఆవరిస్తుంది. శాస్త్రజ్ఞానం విపరీతంగా పెరిగిపోతున్నా, ఇంకా మన రైతుల్లో అధికశాతం మంది పాత ఆలోచనా విధానాల తోనే ఉంటున్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడం, మట్టి నమూనాలు తీయించుకుని, వాటిని ప్రయోగశాలలకు పంపి, వారి సలహా మేరకు మంచి పంటలు వేసుకుని, అందరికీ మంచి పోషకాలుండే ఆహార ఉత్పత్తులను అందించడం వంటి విషయాల గురించి పెద్దగా ఆలోచించడం లేదు. మాభూమి-మా ఇష్టం అనే ధోరణితో అనేకమంది ఏళ్ల తరబడి ఒకే పంట వేసుకుంటూపోతే, ఆ నేల క్రమేణా సారం తగ్గిపోతుందని అర్థం చేసుకోవడం లేదు. పంటలు బాగా పండుతాయని ఇష్టానుసారం ఎరువులు వేసేయడం, తెగుళ్ళు వస్తాయనో.. లేదా రాకుండా చేయాలనో అనుకుని ఎట్లంటే అట్ల పురుగు మందులు చల్లేయడం మనం చూస్తూనే ఉంటాం. అలాంటి అస్తవ్యస్థ విధానాల వల్ల నేలలో పోషకాలు దెబ్బతింటాయని, పండించే పంటల్లో కూడా పోషకాలు తగ్గిపోయి, చివరికి ఉత్పత్తులు కూడా తగ్గి, ఆహారభద్రత కూడా లేకుండాపోతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఆ మేరకు అవగాహన కలిగించాలంటే, ముందు ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించాలి. కానీ, మనదేశంలో అనేక రాష్ట్రాల్లో అసలు భూసార పరీక్షల గురించే పట్టించుకోకపోవడం విచారకరం. పంటలు బాగా పండాలంటే భూసార పరీక్షలు అవసరం. భూమిలో ప్రధాన పోషకాలైన ఉదజని, లవణాలు, నత్రజని, భాస్వరం, పొటాష్ వగైరా పోషకాలు, ఆయా ప్రాంతాల్లో ఉండే నేలల్లో ఏ మేరకు ఉన్నాయో మట్టినామూనా పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు. నేలలో అలాంటి పోషకాలు లేనప్పుడు, ఆ లోపాన్ని చక్కదిద్దుకునేందుకు పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వంటి ప్రత్యామ్నాయాలున్నాయి. దేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలకు, సిబ్బందికి, అధికార యంత్రాంగానికి కొదవే లేదు. భూసార పరీక్షా కేంద్రాలు కూడా కొల్లలుగానే ఉన్నాయి. అయినా, భూసార పరీక్షలు మాత్రం నామమాత్రంగానే జరుగుతున్నాయి. ఎక్కడైనా సరే, రైతులు పంట వేసే ముందు భూమిని బలోపేతం చేసుకోవాలి. ఏ పోషకాలు ఆ భూమిలో లేవో తెలుసుకొని వాటిని ఆ నేలకి అందించాలి. సహజసిద్ధంగా నేలలో ఉండే పోషకాలు ఏమేరకు ఉన్నాయో తెలుసుకోకుండా, పదేపదే రసాయన ఎరువులు, పురుగు మందులు ఎవరికి తోచినట్లు వారు విచక్షణా రహితంగా వాడడం వల్ల నేలలు క్రమేణా దెబ్బతింటున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా మనదేశంలో ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు లేకపోవడం దారుణం. రైతులకు ఇటీవలికాలంలో ప్రభుత్వాలు ఎంతగానో ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి కానీ, ఎంతో ప్రధానమైన భూసార పరీక్షలను మాత్రం నిర్లక్ష్యం చేస్తూనే ఉండడం వల్ల ఆశించిన ఫలితాలు ఉండడం లేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇకనైనా రైతులు భూసార పరీక్షలు, మట్టి నమూనాల పరీక్షల పట్ల అవగాహన కలిగించుకోవాలి. వ్యవసాయ అధికారులను సంప్రదించి లాభదాయకమైన రీతిలో పంటలు పండించుకోవాలి. మనం తినే ఆహార పదార్థాలు పోషకవిలువలు కలిగి ఉండాలంటే, వాటిని పండించే భూముల్లో కూడా పుష్కలంగా పోషకాలు ఉండాలని నిపుణులు పదేపదే చెప్తున్నారు. అలాంటి పోషకాలు లోపిస్తే, అవి ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతాయని స్పష్టం చేస్తున్నారు. నేలలో పోషకాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు, ముఖ్యంగా చిన్నపిల్లలు, తల్లులకు ఎక్కువగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. పంటమార్పిడులు చేయకపోవడం వల్ల ఆ నేల పోషకాలను కోల్పోతుంది కనుక. పోషకాలు సమతుల్యంగా ఉండేలా చూసుకోవాలంటున్నారు.

ఏదేమైనా, ఏడాదికోసారైనా రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుంటే, అదే వారికి శ్రీరామరక్ష. రైతులకే కాదు, తద్వారా దేశానికీ అది శ్రేయోదాయకం. ఇకనైనా ప్రభుత్వాలు మేల్కొని, ఆ దిశగా రైతులను చైతన్యవంతం చేయాలి. నేల ఆరోగ్యమే రైతుకు సౌభాగ్యం.. కనుక, ప్రభుత్వాలతో పాటు రైతులు-అధికారులు సమన్వయంతో కృషిచేసి మన దేశంలోని నేలలను నిస్సారం కాకుండా పదికాలాల పాటు పదిలంగా కాపాడుకోవాలి.

## నరేంద్ర మోడీ నాయకత్వమే దేశానికి రక్ష!

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

మన భారత ప్రధాని నరేంద్ర మోడీ త్వరలో రిటైర్ కాబోతున్నారన్న పుకార్లు ఇటీవల షికారు చేస్తున్న సంగతి తెలిసిందే. 75 సంవత్సరాలు నిండినవారు పదవులలో కొనసాగరాదన్న నినాదాన్ని రాష్ట్రీయ స్వయంసేవక్ చీఫ్ మోహన్ భగవత్ తాజాగా మరోసారి తెరపైకి తెచ్చారు. ఆయన మాటల ఆధారంగా మోడీ ప్రధానమంత్రి కుర్చీ నుండి వైదొలుగుతారు అన్న ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. ప్రస్తుత పరిస్థితులలో మన దేశానికి నరేంద్ర మోడీ లాంటి ధీరోదాత్తుడి నాయకత్వం చాలా అవసరం. ఎంతటి సమస్యనైనా వ్యూహాత్మకంగా సంయమనంతో పరిష్కరించగలిగిన మేధావి మన ప్రస్తుత ప్రధాని. భారతదేశాన్ని అన్ని రంగాలలో అగ్రభాగాన నిలబెట్టడంలో ఆయన చేసిన... చేస్తున్న కృషి అమోఘం, అద్భుతం. వయసుతో నిమిత్తం లేకుండా మరో పదేళ్ళపాటు నరేంద్ర మోడీయే మనదేశానికి ప్రధానిగా కొనసాగాలి. భారతజాతి గర్వించే స్థాయిలో భారత దేశ ప్రతిష్టని పతాకస్థాయిలో నరేంద్ర మోడీ నిలుపుతాడనడంలో సందేహమే అవసరం లేదు.

లక్ష్మీ భరద్వాజ్, హైదరాబాదు.

## నీతిమాలిన నేతలు... సిగ్గుమాలిన కూతలు!

రాను రాను మన ఆంధ్రా రాజకీయాలు మరీ నీచంగా తయారవుతున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత ప్రభుత్వంలో కొంతమంది విపక్ష నేతలు చేస్తున్న కామెంట్లు మరీ దిగజారుడు రాజకీయాలకి అద్దం పడుతున్నాయి. మన జిల్లాలో వైసీపీ నేతల మాటలు, చేష్టలు ఆ పార్టీ నేతల నైజానికి అద్దం పడుతున్నాయి. తాజాగా, మా కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ శాసనసభ్యుడు ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన కామెంట్లు అత్యంత జుగుప్సాకరంగా వున్నాయి. రాజకీయాలలో సీనియర్ నాయకుడిగా వుంటూ, నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి గారి వారసుడనని చెప్పుకుంటున్న ప్రసన్నరెడ్డి ఇలాంటి బజారు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. రాజకీయాలని పక్కనపెట్టి వ్యక్తిగత విమర్శలకి పూనుకోవడం అత్యంత నీతిమాలిన తనం. వేమిరెడ్డి దంపతులని లక్ష్యం చేసుకుని ఎవరైనా సరే ఇలాంటి చౌకబారు విమర్శలుచేస్తే అది ఆకాశం మీద ఉమ్మేసినట్లే. తాము ఊసింది తిరిగి తమ మీదే పడుతుందన్న నిజాన్ని ప్రసన్నకుమార్ లాంటి నేతలు తెలుసుకుంటే మంచిది.

– పి.వేణుగోపాల్‌రెడ్డి, మైపాడు.

## కుట్ర కోణమైతే.. దుర్మార్గమే!

గత మాసం అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం ఇంకా జనం మర్చిపోలేదు. 270 మందికిపైగా ఆ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించారు. అయితే, సదరు ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉందన్న అనుమానం కొంతమంది వ్యక్తం చేస్తున్నారు. దర్యాప్తు బృందం వెల్లడిచేస్తున్న విషయాలు కూడా అలాంటి అనుమానాలనే కలిగిస్తున్నాయి. అదే నిజమైతే అంతకంటే దుర్మార్గం మరొకటి లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని నిజానిజాల నిగ్గుతేల్చాలి. – ఆర్.లక్ష్మణ్‌సింగ్, నెల్లూరు.

సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 99

# “అతి సర్వత్ర వర్జయేత్”

“అతి సర్వత్ర వర్జయేత్”.. మీరు మీ హద్దుల్లో ఉంటే ఇతరులు మీతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తారు. ఇది మన పెద్దలు చెప్పిన సూక్తి. కొంతమంది దీనిని విస్మరించి విర్రవీగుతారు. ఒకసారి పదవిలోకి రాగానే ఇక జీవితాంతం తాము ఆ పదవిలోనే ఉండిపోతామన్నట్లుగా ఊగిపోతారు. తనకి అడ్డూఆపూ లేదన్నట్లుగా చెలరేగిపోతారు. అంతా నా ఇష్టం అన్నట్లుగా పెట్రేగిపోతారు. తీరా ఆ పదవి ఊడాక తోకముడుస్తారు. ప్రస్తుత సమాజంలో కొంతమంది అధికారులు, రాజకీయ నాయకుల పరిస్థితి విడ్డూరంగా ఉంటోంది. ఈ తరం రాజకీయనేతలలో చాలామంది తమ పదవులని చూసుకుని విర్రవీగిపోతున్నారు. తమ పదవులు తాత్కాలికమే అన్న సంగతి మర్చిపోతున్నారు. తాము చచ్చేదాకా ఇదే పదవిలో కొనసాగుతామన్న ధీమాతో రెచ్చిపోతున్నారు. కొంతమంది అధికారులు కూడా వారికి వంత పాడుతున్నారు. ఫలితం పదవులు పోయాక అనుభవిస్తున్నారు.

2014–19 కాలంలోనూ ఆ తరువాత 2019 – 24 సమయంలోనూ ఇలాంటిదే జరిగింది. రాష్ట్రం విడిపోయాక ఏర్పడిన కొత్త రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశం ప్రజలు తెలుగుదేశానికి ఇచ్చారు. రాజశేఖరరెడ్డి అకాల మరణం, జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్రలు వంటి కారణాలతో వైయస్ వారసుడిపైన సానుభూతితో ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కడతారని అందరూ భావించారు. కానీ, విశ్లేషకుల అంచనాలని, వైసీపీ శ్రేణుల ఆశలని తారుమారుచేస్తూ ఆనాటి ఎన్నికలలో జనం బాబుకే జైకొట్టారు. చంద్రబాబుకి ఉన్న సీనియారిటీ, ఆయనకి వున్న అపార పాలనా అనుభవం ఆయనకి అప్పట్లో కలిసొచ్చాయి. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రాన్ని అనుభవశాలి చేతుల్లో పెడితే ఆయనే అన్ని వ్యవస్థల్ని సక్రమంగా గాడిలో పెడతాడన్న గట్టి నమ్మకం ప్రజలచేత బాబుకి ఓటేయించింది.

### ఆంధ్ర రాజకీయాలు 2014కి ముందూ ఆ తరువాత..!

రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రాన్ని 2014కి ముందూ ఆ తరువాతా అన్నట్లుగా చూడాలి. నిజానికి రాష్ట్రం విడిపోక ముందు వరకూ ఆంధ్రాలో రెండు ప్రధాన ప్రాంతీయపార్టీలు ఒకరితో ఒకరు ఎప్పుడూ తలపడలేదు. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో జరిగిన చివరి ఎన్నికలలో కూడా జాతీయపార్టీ కాంగ్రెస్, ప్రాంతీయపార్టీ టీడీపీయే ప్రధానంగా తలపడ్డాయి. చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యం బరిలోఉన్నప్పటికీ ఆ పార్టీ రాజకీయంగా పెద్దగా ప్రాధాన్యత సంతరించుకోలేదు. ప్రజలు కూడా ప్రజారాజ్యాన్ని ప్రధాన ప్రాంతీయపార్టీగా గుర్తించలేదు. జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీని ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రారంభించినప్పటికీ ఆ పార్టీ తొలిసారి ప్రత్యక్ష సార్వత్రిక ఎన్నికలలో పాల్గొనేటప్పటికి రాష్ట్రం రెండు ముక్కలయ్యింది. కొత్త రాష్ట్రం ఆంధ్రాలో కాంగ్రెస్‌పార్టీ కనుమరుగయ్యింది. వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ తెలుగుదేశానికి ప్రత్యామ్నాయంగా అవతరించింది. నవ్యాంధ్రలో జరిగిన తొలి ఎన్నికలలో వైసీపీ ఓటమి పాలయ్యింది. 2014–19 కాలంలో ఆంధ్రా అసెంబ్లీలో అధికార ప్రతిపక్ష పార్టీలుగా రెండూ ప్రాంతీయపార్టీలే తలపడ్డాయి. ఆ తరుణంలో మొదలైన దూషణలపర్వం ఇప్పటికీ నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంది. నాయకులంతా స్థానిక పార్టీలకి చెందినవారు కావడంతో పార్టీలలో వ్యక్తి భజన సంప్రదాయం మొదలయ్యింది. మా నాయకుడు గొప్ప అంటే.. మా నాయకుడే గొప్ప అని అసెంబ్లీ సాక్షిగా పరస్పరం వాదులాడుకోవడం ప్రారంభమయ్యింది. చినికి చినికి గాలి వానగా మారినట్లు ఆ వాదులాడుకోవడం కాస్తా ఒకరినొకరు బూతుపురాణాలతో దూషించుకునే స్థాయికి పెరిగింది. రాష్ట్ర రాజకీయ రంగం కాస్తా ముఠా తగాదాలకు వేదికగా తయారయ్యింది.

### అసెంబ్లీ వేదికగా నువ్వెంతంటే నువ్వెంత!

ముఠాపోరులా, వీధి తగాదాలలా, మంచినీటి కోసం కొళాయిల దగ్గర బిందెలతో కొట్టుకునే మహిళల తన్నులాటలా 2014 తరువాత రాష్ట్ర అసెంబ్లీ తయారయ్యింది. అధికార, ప్రతిపక్ష పార్టీల సవాళ్ళు ప్రతిసవాళ్ళతో శాసనసభ దద్దరిల్లింది. రాజకీయ ప్రత్యర్థులు కాస్తా వ్యక్తిగత శత్రువులుగా మారేలా పరిస్థితులు మారాయి. తొడలు కొట్టుకోవడం, మీసాలు మెలేయడం, చొక్కాలు మడవడం, వ్యంగ్యంగా మాట్లాడడం, “దమ్ముంటే రా చూసుకుందాం” అంటూ సవాళ్ళు విసురుకోవడం వంటి కొత్త ఒరవడికి సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ శాసనసభ వేదికయ్యింది. గుట్టుగా సంసారం చేసుకునే మహిళలని కూడా రాజకీయ రొంపిలోకి లాగి అవమానించే సంస్కృతికి నాయకులు నాంది పలకడం సిగ్గుచేటైన విషయం. రాజకీయ ప్రత్యర్థులు వ్యక్తిగత శత్రువులుగా మారేంతగా రాష్ట్ర రాజకీయాలు రూపాంతరం చెందాయి. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకునే సంస్కృతి తారాస్థాయికి చేరింది. రెండు పార్టీలు అనే విధానం పోయి.. రెండు వర్గాలు అన్నట్లుగా నేతలు విడిపోయారు.

### మంత్రులు సైతం!

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితులు పతాక స్థాయికి చేరుకున్నాయి. సాక్షాత్తూ ఆ పార్టీ మంత్రులు సైతం బూతులు వల్లించడం మొదలుపెట్టారు. ఆ పార్టీ సలహాదారులమని చెప్పుకునే పెద్దమనుషులు సామాజిక మాధ్యమాల వేదికలుగా గుట్టుగా సంసారం చేసుకునే మహిళలని కూడా రచ్చకీడ్చారు. రాజకీయాలంటేనే జుగుప్స కలిగే స్థాయిలో పరిస్థితులని దిగజార్చారు. సిగ్గు, లజ్జ, నీతి, నియమం అన్నీ వదిలేసి ప్రవర్తించారు. ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నారు. ఆ పార్టీ నాయకగణం మొత్తం కేసుల్ని ఎదుర్కొంటున్నారు. సగం మందికిపైగా బెయిళ్ళపై బయట తిరుగుతున్నారు. మళ్ళీ తాము అధికారంలోకి వస్తే ప్రస్తుత అధికారపార్టీ వాళ్ళ పరిస్థితి కూడా ఇలాగే ఉంటుందని సవాళ్ళు విసిరుతున్నారు. తాజాగా, మన రాష్ట్రంలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, పేర్ని నాని, తెలంగాణలో తీన్మార్ మల్లన్న లాంటి వాళ్ళు చేసిన వ్యాఖ్యలు ఇలా బరితెగించినవే. పార్టీ ఏదైనా.. వ్యక్తులు ఎవరైనా.. ఈ సంస్కృతి, సంప్రదాయం మంచిదికాదు. పెద్దలు చెప్పినట్లు “అతి సర్వత్ర వర్జయేత్” నోరు మంచిదైతే ఊరు మంచిదంటారు. అలాకాకుండా నువ్వలా, నేనిలా అన్న చందంగా వ్యవహరిస్తే ఎవరినీ ఎవరూ బాగుచేయలేరు. ఇదే సంస్కృతి కొనసాగితే భవిష్యత్ రాజకీయాలు వీధి కొట్లాటలలా తయారై రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం మాత్రం ఖాయం..!

- రాజశ్రీ

# మంటలు రేపుతున్న మాటలు!

- ప్రసన్న వ్యాఖ్యలతో వైకాపాలో దుమారం
- టీడీపీలోకి చేరిపోతున్న మహిళలు

**కోవూరు శాసనసభ్యురాలు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు.. మహాదాత.. పేదప్రజల ఆత్మబంధువు.. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై, మాజీమంత్రి..కోవూరు మాజీఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. వరుసకు చెల్లెలైన ప్రశాంతమ్మపై వైకాపా నాయకుడు ప్రసన్న మాటలు కోవూరు నియోజకవర్గంలోనూ మంటలు రేపుతున్నాయి. ప్రజలకు అభిమానపాత్రురాలైన ప్రశాంతి రెడ్డిపై అక్కసుతో ప్రసన్న వ్యక్తిగత నిందాపూరిత వ్యాఖ్యలు చేయడంతో మహిళల్లో కోపం నషాళానికంటుతోంది. మహిళల పట్ల ఇంత చులకనభావంతో మాట్లాడిన ప్రసన్న తీరుపై మహిళాలోకం మండిపడుతోంది. అంతేకాదు, ప్రసన్న మాటలపై టీడీపీలోనే కాదు, వైకాపాలోని మహిళలు కూడా భగ్గుమంటున్నారు. మహిళలను నీచంగా మాట్లాడే ఇంత హీనమైన నాయకులున్న వైకాపాకి గుడ్‌బై చెప్పేస్తున్నామంటూ మరికొందరు ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి, టీడీపీలోకి చేరిపోతున్నారు.**

ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న మాటలు కోవూరు రాజకీయాల్లో మరింత మంట పుట్టిస్తున్నాయి. వైకాపాలో కూడా కుంపట్లు రాజేస్తున్నాయి. దీంతో, నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో మహిళలు రోడ్ల మీదకి వచ్చి ప్రసన్నరెడ్డి తీరుపై నిరసనలు కూడా వ్యక్తం చేస్తున్నారు. కోవూరు నియోజకవర్గ ప్రజలను అటు నెల్లూరు ఎంపీ వీపిఆర్, ఇటు ఆయన సతీమణి ప్రశాంతమ్మలు ఎంతగానో ఆదుకుని, ఎన్నో రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే, అలాంటి నాయకులపై తప్పుడు ప్రచారాలు చేయడం ఏమిటంటూ మహిళలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఈనెల 14న కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరులో మండల టీడీపీ నాయకులు, మహిళా నాయకులు అందరూ కలసి పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. కొడవ



లూరు జడ్పీ హైస్కూలు వద్ద నుంచి, రాజుపాళెం సెంటరు దాకా భారీర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ప్రసన్న వ్యాఖ్యలకు నిరసనలు తెలిపారు.

### వైకాపా మహిళలు కూడా అండగా నిలిచారు :

ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రసన్న తనపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో, తనకు మద్దతుగా పలువురు వైకాపా మహిళా నేతలు వైకాపానుంచి తెలుగుదేశం పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు చేసిన ప్రసన్నకుమార్‌రెడ్డి నాయకత్వంలో పనిచేసేందుకు ఏ ఒక్కరూ సిద్ధంగా లేరని, టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికి తగిన ప్రాధాన్యత ఉంటుందని ఆమె తెలిపారు.



### వైకాపా నుంచి టీడీపీలోకి :

ప్రసన్న డర్టీ కామెంట్స్‌కు నిరసనగా వైసీపీకి బైబై చెప్పేస్తున్నామంటూ పలువురు వైకాపా మహిళా నాయకులు కూడా టీడీపీలోకి వచ్చేస్తున్నారు. మహిళలను గౌరవించలేని వైకాపాలో ఉండలేమంటూ అనేకమంది మహిళలు తెగేసి చెబుతున్నారు. దీంతో వైకాపా పరిస్థితి అయోమయంలో పడింది. ఇటీవల జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్, ఇందుకూరుపేట జడ్పీటీసీ విజయలక్ష్మి, ఆమె భర్త..ప్రసాద్ కలసి దాదాపు వెయ్యి మంది కార్యకర్తలతో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ నేత, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ వారికి కండువాలు కప్పి, టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు సముచిత గౌరవం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న నోరు పారేసుకుంటే టీడీపీ అధినాయకత్వం అంతా ఆమెకు అండగా నిలిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి భార్య భారతిపై కొందరు వ్యాఖ్యలు చేస్తే, వాటిని చంద్రబాబు ఖండించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వైకాపా నాయకుల ప్రవర్తన నచ్చకే విజయలక్ష్మి, ఆమె భర్త ప్రసాద్‌లు వైకాపా నుంచి టీడీపీలోకి చేరారని తెలిపారు.



# ముత్తుకూరుకు మంచిరోజులు

- దత్తత తీసుకున్న అదాని కృష్ణపట్నం పోర్టు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమం నెల్లూరుజిల్లా ముత్తుకూరు పంచాయతీకి వరం కాబోతోంది. మేజర్ పంచాయతీ అయిన ముత్తుకూరును అదాని కృష్ణపట్నం పోర్టు వారు దత్తత తీసుకోవడంతో ఆ పంచాయతీకి మహర్దశ రానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముత్తుకూరులో అధికారులతో సమావేశమై, చేయాల్సిన అభివృద్ధి పనులను చర్చించారు. నిర్ణీత కాలపరిమితితో పనులు పూర్తిచేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా, ముత్తుకూరులో అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థను గాడిలో పెట్టడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ రహిత ముత్తుకూరును తీర్చిదిద్దే బాధ్యత తమదని, ముత్తుకూరుతో పాటు కృష్ణపట్నం, గోపాలపురంల అభివృద్ధి బాధ్యత తమదేనని పోర్ట్ ప్రతినిధులు చెప్పారు. పనుల వేగవంతానికి అధికారులు, పోర్టు ప్రతినిధులు, స్థానిక నేతలతో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చేపట్టిన పీ4 కార్యక్రమం అద్భుత ఫలితాల దిశగా సాగుతోందన్నారు. 20 వేల మందికి పైగా జనాభా కలిగిన ముత్తుకూరు మేజర్ పంచాయతీని దత్తత తీసుకోవడంతో పాటు కృష్ణపట్నం, గోపాలపురం గ్రామాల అభివృద్ధి బాధ్యత చేపట్టిన పోర్టు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

## మాచర్లవారిపాళెంకి.. ఎన్డీఆర్ గ్రూప్ వెలుగులు



నెల్లూరుకు చెందిన ప్రముఖ కంపెనీ.. ఎన్డీఆర్ గ్రూప్ అధినేత నాయుడు ఆదికేశవులు రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలోని మాచర్లవారిపాళెం గ్రామాన్ని దత్తత తీసుకుని, ఆ గ్రామ అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 300 ఇళ్ళపై సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఆయన నిర్ణయించుకున్నారని, అదేవిధంగా, విద్యార్థులకు విద్యాపరమైన సహకారం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, పేదల ఆర్థికాభివృద్ధికి చర్యలు, చేపట్టబోతున్నారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ గ్రూప్ అధినేత నాయుడు ఆదికేశవులురెడ్డికి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## నువ్వేంటీ!..ఆ మాటలేంటీ?

### ప్రసన్నకి హైకోర్టు మొట్టికాయ

'మాజీ ఎమ్మెల్యే అయివుండి, మహిళా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమిటీ?..ఆ వ్యాఖ్యలను ఉపేక్షించేది లేదు'..అంటూ హైకోర్టు ఈనెల 15న కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తీరును తప్పుపట్టింది.

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై ఇటీవల ప్రసన్న చేసిన అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో, తనపై పోలీసులు కేసులు నమోదు చేయడంతో ప్రసన్న తనకు ముందస్తు బెయిలు ఇవ్వాలటూ హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఆ కేసును పరిశీలించింది. అలాంటి వ్యాఖ్యలు చేయడం మానుకోండి.. అయినా ఓ మాజీ ఎమ్మెల్యే.. ఓ మహిళా ఎమ్మెల్యేపై ఇలాగేనా మాట్లాడేది?.. అంటూ మండిపడింది. అలాంటి వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?.. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండండి'.. అని హెచ్చరించింది. ముందస్తు బెయిలు కోసం వచ్చిన ప్రసన్న తరఫు న్యాయవాది చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. అనంతరం కేసును వాయిదా వేసింది.

# దివికేగిన సినీ దిగ్గజాలు





***ఈ వారం రెండు విషాదాలు. తెలుగు సినీపరిశ్రమలో ప్రముఖులుగా వెలుగొందిన విలక్షణ నటుడు, విలనీలో, హాస్యనటనలో తనకు తానే సాటి అనిపించుకున్న కోట శ్రీనివాసరావు(83) అనారోగ్యంతో ఈనెల 13వతేదీ ఆదివారం వేకువన హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం నుంచి సినీరంగం కోలుకోకముందే, అలనాటి ప్రఖ్యాత నటి.. దేశంలోనే తొలి మహిళా సూపర్‌స్టార్, తెలుగుతో పాటు పలుభాషల్లోని చిత్రాలలో కూడా నటించి అశేష ప్రేక్షక జనావళిని ఉర్రూతలూగించిన బి.సరోజాదేవి అస్తమయం అందరినీ శోకతప్త హృదయుల్ని చేసింది. ఈనెల 16న బెంగుళూరులో ప్రభుత్వ లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు జరిగాయి.***

కోట శ్రీనివాసరావు ఏ పాత్రను పోషించినా, అది నటనలాగా అనిపించదు. ఆయా పాత్రల్లో ఆయన ఇట్టే అతికిపోతారు. సహజసిద్ధమైన నటనా చాతుర్యం ఆయన సొంతం. దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా ఆయన తెలుగు సినీరంగంలో ఉంటూ, అనేక క్లిష్టమైన పాత్రలను కూడా అలవోకగా పోషించారు. 1942లో కృష్ణాజిల్లా కంకిపాడులో జన్మించిన కోట..రంగస్థలంపై నాటకాలు వేస్తూ సినీరంగంలోకి వచ్చారు. 1978లో 'ప్రాణం ఖరీదు' సినిమాలో ఆయన తొలిసారిగా నటించారు. ఆ తర్వాత నుంచి తన అసామాన్య నటనతో అగ్రశ్రేణి హీరోలతో కూడా నటిస్తూ. అంచలంచెలుగా ఎదిగారు. దాదాపు 750 చిత్రాల్లో ఆయన నటించారు..అనడం కంటే జీవించారు అనడమే సరైన మాట. ప్రతిఘటన, అహనా పెళ్ళంట, ఆ నలుగురు వంటి అద్భుతమైన చిత్రాల్లో విభిన్నపాత్రల్లో ఆయన నటన అద్వితీయం. అందుకు గుర్తింపుగా ఆయనకు పద్మశ్రీ తదితర ఎన్నో ఘనమైన పురస్కారాలు లభించాయి. హాస్యంతో కూడిన విలనీ ఆయన ప్రత్యేకత. ఆయన సంభాషణా ప్రతిభ అమోఘం. నటనకే జీవం పోసి.. తెలుగువారి గుండెల్లో చిరస్మరణీయమైన నటునిగా ఆయన నిలచిపోయారు.

### అలనాటి మేటి నటీమణి బి.సరోజాదేవి

అలనాటి మేటి నటీమణి..బహుభాషా నటి బి.సరోజాదేవి(87) వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలతో ఈనెల 14వ తేదీ సోమవారం కన్నుమూశారు. 1938లో బెంగుళూరులో జన్మించారామె. తండ్రి ప్రోత్సాహంతో నాటకరంగంలో అనేక పాత్రలు పోషిస్తూ, ఆ తర్వాత సినీ రంగానికి వచ్చారు. ఆమె తొలి సినిమా 'మహాకవి కాళిదాసు' చిత్రం సూపర్‌హిట్ కావడంతో పలు భాషా చిత్రాల్లో కూడా ఆమెకు అవకాశాలు మెండుగా వచ్చాయి. తెలుగు సినిమాలతో పాటు, కన్నడ-తమిళ-హిందీ భాషల్లోనూ సుమారు 200కిపైగానే చిత్రాల్లో ఆమె నటించారు. 19ఏళ్ళ వయసు కూడా దాటకముందే దాదాపు వంద సినిమాల్లో నటించడం ఆమె నటనా ప్రతిభకు నిదర్శనం. శ్రీకృష్ణార్జునయుద్ధం, అమరశిల్పి జక్కన, ఆత్మబలం, సీతారామ కల్యాణం, దానవీరశూర కర్ణ వంటి చిత్రాల్లో ఆమె నటనా వైభవం చెప్పనలవి కాదు. పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు కూడా ఆమెను వరించాయంటే ఆమె నటనా వైదుష్యం ఎంత గొప్పదో!.. సుమారు మూడు దశాబ్దాల పాటు సినీ రంగంలో ఉంటూ, అనేక రాష్ట్రాల ప్రేక్షక జనవాహినిని మెప్పించిన బి.సరోజాదేవి లేకపోవడం సినీరంగానికి తీరని లోటు!..

# నెల్లూరు కబుర్లు

## శాకంబరిగా ఇరుకళల పరమేశ్వరిదేవి



ఆషాఢమాసం సందర్భంగా ఈనెల 13న సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు నేత్రపర్వంగా శాకంబరి అలంకారం నిర్వహించారు. తొలుత మూలవర్లకు శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

### శ్రీ రాజరాజేశ్వరిదేవిని దర్శించుకున్న..
## భూ పరిపాలన అధికారిణి



నెల్లూరు దర్గామిట్టలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని ఈనెల 13న రాష్ట్ర భూ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి జి.విజయలక్ష్మి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో ఆమెను సాదరంగా స్వాగతించి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం, ఆలయంలోని శ్రీ సుందరేశ్వరస్వామివారిని ఆమె దర్శించుకుని ఖడ్గమాల పూజలు చేశారు. నెల్లూరు ఆర్డీఓ అనూష, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భాగవత శ్రవణం.. ముక్తిదాయకం



భాగవత శ్రవణం (వినడం) ముక్తిదాయకమని రామకృష్ణ మిషన్ స్వామీజీ శ్రీ హృదానంద మహారాజ్ ఉద్బోధించారు. ఇటీవల నెల్లూరు–మైపాడు రోడ్డు 3వమైలు వద్ద ఉన్న రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో, స్థానిక పద్యసారస్వత పరిషత్–నెల్లూరు శాఖ వారిచే భాగవత సప్తాహం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో స్వామీజీ మాట్లాడుతూ, భాగవతంలోని విశిష్టతలను వివరించారు. పద్యసారస్వత పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావు సభాధ్యక్షులుగా, డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు సభాసంచాలకులుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవధాని కోట రాజశేఖర్ ప్రహ్లాదుని గుణగణాలను విశదీకరించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు రీజియన్ చైర్మన్ నలుబోలు బలరామయ్య నాయుడు సభా పోషకులుగా వ్యవహరించారు. ప్రముఖ పండితులు ఆగస్త్యరాజు సుబ్బారావు, తుర్లపాటి లక్ష్మినారాయణ, డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య, చక్కిరాల జయప్రసాద్, కోట శ్రీరామమూర్తి, శతావధాని కొండపి మురళీకృష్ణ, స్వామి సమయానందనాథ, అన్నవరం సత్యనారాయణ, తూములూరు వెంకటేశ్వర్లు, జయచంద్ర పాల్గొన్నారు. పద్యసారస్వత పరిషత్ కోశాధికారి సూరం చంద్రశేఖరం వందన సమర్పణ చేశారు.

### తనికెళ్ళ భరణికి..
## నెల్లూరు కళాకారుల శుభాకాంక్షలు



ప్రముఖ సినీ నటులు, తెలుగు సినీ రంగ వినీలాకాశంలో సుప్రసిద్ధ తారగా వెలుగొందుతున్న తనికెళ్ళ భరణి పుట్టినరోజును పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు కళాకారుల తరఫున ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నెల్లూరుజిల్లాకు చెందిన హాస్యనటుడు, 'కళారత్న' దోర్నాల హరిబాబు, బాలాజీనగర్ నంద, మీనా శారీస్ ప్రశాంత్, సురేష్ తదితరులు హైదరాబాదులోని తనికెళ్ళ భరణి ఇంటికి వెళ్ళి, ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ వితరణ



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పనిచేస్తున్న 15 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నిత్యావసర వస్తువులను తమ వితరణగా అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, వాకర్స్ 203–ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, షేక్ నజీర్ అహ్మద్, బి.రామ్మోహన్‌రెడ్డి, బి.చెంచయ్యనాయుడు, కె.సుబ్బారావు వి.వెంకటేశ్వర్లు, కె.వెంకటరమణ, సోను, ఎం.సురేష్, కె.రఘురాం ముదిరాజ్, కె.తిరుపతి నాయుడు, ఏకొల్లు రాఘవరెడ్డి, బి.సదానందరెడ్డి, వి.ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం, దాతలను సన్మానించారు.

## చక్రాల వారి ట్రస్ట్ వార్షికోత్సవం



నెల్లూరులోని చక్రాల వారి ట్రస్ట్ 12వ వార్షికోత్సవం ఇటీవల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్ మాట్లాడుతూ, ఆదిశంకర ధ్యాన మందిరం కమిటీ సభ్యుల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నామని, గత రెండు సంవత్సరాలుగా నెల్లూరుపట్టణ పరిధిలో పాత మున్సిపల్ ఆఫీసు ఆవరణలో ఉన్న పట్టణ నిరాశ్రయ వృద్ధాశ్రమంలోనూ, జాకీర్‌హుస్సేన్‌నగర్ ప్రాంతంలోని పంచవటి ఆశ్రమంలోనూ నిర్వహించడం జరుగుతోందన్నారు. అన్నదాన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చక్రాల వెంకట లక్ష్మీ నరసింహం, అన్నవరం సత్యనారాయణ, పామర్తి వెంకట లీలామోహన్, ములుముడి ఉదయకుమార్, వంక శ్రీహరి ప్రసాద్‌రావు, మల్లవరపు లక్ష్మీనరసింహారావు, తూములూరు వెంకటేశ్వర్లు, ఒంగోలు సుధాకర్‌రావు, మైపాడు రాజాశర్మ తదితరులు పాల్గొన్నారు.



### 'సుపరిపాలన తొలి అడుగు'లో..
## రూరల్ ఫస్ట్
### ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమాల అమలులో రాష్ట్రంలోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గం ప్రథమస్థానంలో ఉందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఆయన 36వ డివిజన్‌లో అధికారులు, ప్రజలతో కలిసి స్థానిక సమస్యలను చర్చించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్యకర్తల సమిష్టి కృషితోనే రాష్ట్రంలో ఇంత గుర్తింపు రావడం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలని ఆయన కోరారు. ప్రజలను వేధింపులకు గురిచేయొద్దని, ఏ అధికారి పొరపాటు చేసినా చర్యలు తప్పవని అన్నారు. ప్రజలకు నష్టం చేస్తే ఊరుకునేది లేదని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదని హెచ్చరించారు. 'ఎవరి సిఫారసు అక్కర్లేదు–జనానికి మంచి చేయండి'.. అని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ షంషుద్దీన్, కార్పొరేటర్ పిండి శాంతిశ్రీ, డివిజన్ అధ్యక్షులు షేక్ రసూల్, జనసేన నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, జమీర్ పాల్గొన్నారు.

## డా. గంగిశెట్టికి..జేవీవీ సన్మానం



ప్రముఖ బాలసాహితీవేత్త, ఇటీవలే కేంద్ర సాహిత్య అకాడమీ వారు బాలల సాహిత్యంలో అవార్డును ప్రకటించిన డా. గంగిశెట్టి శివకుమార్‌ను ఈనెల 13న నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో ఘనంగా సన్మానించారు. కేంద్రసాహిత్య అకాడెమీ బాలసాహిత్య పురస్కార్ అవార్డును పొందిన డా.గంగిశెట్టి శివకుమార్ బాల సాహిత్యంలో చేసిన విశేషకృషిని ఈ సందర్భంగా వక్తలు ప్రశంసించారు. ఆయనకు అవార్డ్ తెచ్చి పెట్టిన 'కబుర్ల దేవత' బాలల కథలపుస్తకాన్ని ప్రముఖ రచయిత్రి చంద్రలత సమగ్రంగా సమీక్షించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, కవయిత్రులు గోవిందరాజుల సుభద్రాదేవి, పాతూరి అన్నపూర్ణ, సూర్యప్రకాశరావు, కామయ్య, మాదాల కృష్ణ తదితరులతో పాటు జేవీవీ నాయకులు ఎం.వి.చలపతి, నాగేష్, గోపీనాథ్, కె.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.






### సాయిదర్బార్‌లో
## నేత్ర వైద్యశిబిరం
### 440 మందికి ఉచితంగా కంటిపరీక్షలు



నెల్లూరు పద్మావతినగర్‌లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఈనెల 13న ఉచిత మెగా కంటివైద్య శిబిరం నిర్వహించి సుమారు 440 మందికి కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులిచ్చారు. గురుపూర్ణిమ మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీసాయినాథుడు ఆచరించి చూపిన మానవసేవలో భాగంగా మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మందిర ప్రాంగణంలోని శ్రీ సాయిమాత నిత్యాన్న ప్రసాదాలయంలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో పెద్దసంఖ్యలో రోగులు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవడం విశేషం. స్థానిక పీవీల్ రావు మోడరన్ ఐ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ బృందం సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించారు. కంటి పరీక్షల అనంతరం, అవసరమైన 45 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేయించనున్నట్లు మధుసాయి ఈ సందర్భంగా తెలిపారు. కంటి వైద్యులు డాక్టర్ వినీల, డాక్టర్ హేమలత, సీఈఓ రామసుబ్బారావు, మోడరన్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోఅద్దాల మందిరం గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, శ్రీ సాయిదర్బార్ యువసేవాదళ్ సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

# ఏడాది పాలన.. అభివృద్ధికి ఆలంబన

## - మంత్రి నారాయణ



కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు భరోసా కలిగిందని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరులోని 46, 50వ డివిజన్లలో కటారిపాలెంలో సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, కూటమి పాలనలో ప్రజలు ప్రశాంతంగా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. సుపరిపాలన తొలి అడుగుకు కార్యక్రమానికి తాము ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పరిపాలన చాలా బాగుందని ప్రజలు కితాబు ఇచ్చారని తెలిపారు.. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్పటికీ మాటమీద నిలబడ్డ ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ అని.. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని అన్నారు. ఆగస్టు నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు జరుగుతుందని, అన్నదాత సుఖీభవ కింద రైతులకు 20వేల రూపాయలు ఇవ్వబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ మహేంద్రారెడ్డి, క్లస్టర్ ఇంచార్జులు కప్పిర శ్రీనివాస్, సత్యనాగేశ్వరరావు, కో క్లస్టర్ ఖాదర్‌బాషా, టీడీపీ మహిళా నాయకురాలు కప్పిర రేవతి తదితరులు పాల్గొన్నారు

# అధిష్టానం మాటే శిరోధార్యంగా పనిచేయాలి

## • ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల



తెలుగుదేశం పార్టీ అధిష్టానం మాటే శిరోధార్యంగా ప్రతి ఒక్కరం పని చేయాలని, ప్రజలకు సేవ చేసేందుకు పదవులు ముఖ్యం కాదని, పార్టీలో కష్టపడితే పదవులు వాటంతట అవే వస్తాయని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ చెప్పారు. ఈనెల 13న వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం, జరిగింది. నియోజకవర్గ పరిశీలకులు వల్లభనేని సుబ్బారావు, వికాస్ హరికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి ప్రతి కార్యకర్త, నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో 175 నియోజకవర్గాలలో 12వ స్థానంలో ఉన్నామని, దీనిని పది రోజుల లోపల 70శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఎనిమిది మండలాల మండల నాయకత్వం పనిచేయాలని తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా, పార్టీలో కష్టపడిన వారికి పదవులు దక్కాలన్న ఉద్దేశంతో నియోజకవర్గంలో సుమారు 90 పంచాయతీలలో తిరిగి గ్రామ కమిటీలను ఎన్నిక చేయడం జరిగిందన్నారు. పదవులు లేవని అధైర్య పడవద్దని, తెలుగుదేశం కార్యకర్త కావడమే గొప్ప పదవి అని తెలిపారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలాంటి వారని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదని అన్నారు. వైకాపా వారి వికృత చేష్టలు, బూతు పురాణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, దంపతులపై ఇటీవల మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే..టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంభం విజయరామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ పొన్నుబోయిన చంచలబాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శులు, మన్నేటి వెంకటరెడ్డి, ఎల్సి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్లు గ్రామాల్లో పర్యటించాలి

## భూపరిపాలన ముఖ్యకార్యదర్శి సూచన



తహశీల్దార్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటించినప్పుడే సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపగలుగుతారని భూపరిపాలన ముఖ్య కార్యదర్శి విజయలక్ష్మి అన్నారు. ఇటీవల ఆమె నెల్లూరు నగర పర్యటనలో భాగంగా, కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఆర్డీవోలు, తహశీల్దార్లతో రెవెన్యూ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. తహశీల్దార్లందరూ ప్రజలకు దగ్గరగా వెళ్లినప్పుడే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. రెవెన్యూ సిబ్బంది అందరూ విధుల పట్ల బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ప్రధానంగా రీసర్వే చేపట్టిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పిఎంను త్వరగా విడగొట్టి వ్యక్తిగతంగా పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. జాయింట్ ఎల్‌పిఎంగా నమోదు చేయడం వల్ల చాలా మంది రైతులు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారన్న ఆమె, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అర్హులైన రైతులకు అందించేందుకు వెంటనే జాయింట్ ఎల్‌పిఎం సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. వచ్చేవారంలోగా జాయింట్ ఎల్‌పిఎం సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రీసర్వే సమస్యల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ప్రజలు అందిస్తున్న ప్రతి అర్జీని క్షుణ్ణంగా చదివి నిర్ణయం తీసుకోవాలన్నారు. పరిష్కారం చేయకుండా తిరస్కరించిన అర్జీలను ఆడిట్ టీమ్‌లు మరొకసారి పరిశీలించాలన్నారు. కాస్త మనసుపెట్టి ఆలోచన చేస్తే ప్రజలకు రెవెన్యూ సేవలు సంతృప్తిగా అందించగలుగుతామని అన్నారు. రెవెన్యూ భూసమస్యల పరిష్కారంలో ఏవైనా సాంకేతిక పరమైన సమస్యలు ఎదురైతే వెంటనే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని, ఇక్కడ కూడా పరిష్కారం కాకపోతే సిసిఎల్ఎను సంప్రదిస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో హుస్సేన్‌సాహెబ్, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవోలు అనూష, వంశీకృష్ణ, పావని, తహశీల్దార్లు పాల్గొన్నారు.

## • కూటమి పాలనలో కక్షసాధింపులు ఉండవు

# తప్పు చేస్తే ఫలితం అనుభవించాల్సిందే!

## - సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



తమ కూటమి ప్రభుత్వ పాలనలో ఎవరిపైనా కక్ష సాధింపులు ఉండవని, ఎవరైనా సరే.. తప్పు చేస్తే ఫలితం అనుభవించాల్సిందేనని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన అమరావతిలో విలేకర్లతో మాట్లాడుతూ, వైకాపా తీరుపై, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధోరణిపై విమర్శలు గుప్పించారు. పాత సినిమాల్లో రాజనాల పాత్రకుమించి జగన్‌రెడ్డి విలనిజం, రాష్ట్రాన్ని అరాచకంగా మార్చాలనే కుట్రలో జగన్మోహన్‌రెడ్డి అండ్ బ్యాచ్ ఉందన్నారు. పవన్‌కళ్యాణ్, లోకేష్ బాబులను ఒరేయ్, తురేయ్ అని సంబోధిస్తున్న వైసీపీ నేతలకు వళ్లు కొవ్వెక్కిందా..అని ప్రశ్నించారు. పేర్ని నాని, ప్రసన్న లాంటివారి నోటి వెంట వచ్చే ప్రతి మాట జగన్‌రెడ్డి స్క్రిప్టేనన్నారు. ఐదు పదుల వయస్సులోనే సంతకం పెట్టాలంటే చేతులు వణికేవారు, తమ నాయకుడిని విమర్శిస్తారా అంటూ సోమిరెడ్డి మండిపడ్డారు. ఇప్పటికైనా భాష, తీరు మార్చుకోకుంటే వైసీపీ కనుమరుగు కావడం ఖాయమన్నారు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ గాడినపడుతున్నాయి, కానీ వైసీపీ తీరుతో రాజకీయాలు రోడ్డున పడుతున్నాయని ఆయన అన్నారు. ఈ విషయంలో పేర్ని నాని అయినా, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అయినా, మరొకరు అయినా ఒకటేనన్నారు. ప్రజలు 11సీట్లకు పరిమితం చేసినా జగన్మోహన్‌రెడ్డి అండ్ బ్యాచ్‌లో మార్పు రావడం లేదన్నారు. విజనరీ, సబ్జెక్టు, కష్టపడేతత్వం.. ఇలా ఏ అంశంలోనైనా మా నాయకుడితో మీ జగన్‌రెడ్డి సరితూగగలడా అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు దేశానికే ఒక రోల్‌మోడల్.. ఐటీ అభివృద్ధిలో చంద్రబాబునాయుడి పాత్రను ప్రధానమంత్రి నరేంద్రమోదీ పొగిడారంటే చంద్రబాబు స్థాయి ఏంటో అర్థమవుతుందన్నారు. జగన్‌రెడ్డి రాజకీయ జీవితమంతా రక్త చరిత్రేనని, చిన్నాయన మర్డర్.. తల్లి, చెల్లి గెంటివేత... సొంత చెల్లెళ్లే ఆయనతో పోరాటం సాగిస్తున్న పరిస్థితి.. అంటూ విమర్శించారు. రప్పారప్పా నరుకుతామని ఒకసారి, రాత్రి నరికేసి పొద్దున పరామర్శకు వెళ్లాలని మరోసారి రెచ్చగొట్టేలా వ్యవహరించిన వైసీపీ నాయకులకు కూడా ఆ చట్టం వర్తింపజేయాలన్నారు. ప్రస్తుత రాజకీయాలు జరుగుతున్న విధానం చూస్తుంటే..తాము రాజకీయ నాయకులం అని చెప్పుకోవడానికి సిగ్గుపడాల్సివస్తోందన్నారు. రాజకీయ నాయకులంటే ప్రజలు ఒక దురభిప్రాయానికి వెళ్లే పరిస్థితి తెచ్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# బాలసదనంలో.. బాలల హక్కుల కమిషన్



నెల్లూరు నగరంలోని బాలసదనాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ బి.పద్మావతి ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలసదనంలో ఉన్న పిల్లలతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న భోజనం మెనూ, చదువుకు సంబంధించిన వసతులను ఆమె ప్రత్యేకంగా పరిశీలించారు. ఇటీవల సెల్‌ఫోన్ అపహరించిందనే అనుమానంతో కాల్చి గాయపరచిన బాలికను ఆమె పరామర్శించారు. ఆ బాలిక ఆరోగ్యానికి సంబంధించిన నివేదికలను ఆమె పరిశీలించారు. ఆ బాలికకు మెరుగైన ఆహారాన్ని అందించాలని బాలసదనంలో ఉన్న సూపరింటెండెంట్, సిబ్బందికి సూచించారు. బాలసదనంలో ఉన్న ఫిర్యాదు పెట్టెలను, రికార్డులను కూడా ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జెసిడిఓ మమత, ఐసిపిఎస్, బాల సదన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మంత్రి ఆనం చొరవతో
# సంగం ఐటీఐకి శాశ్వత భవనాలు

మండల కేంద్రమైన సంగంలోని ప్రభుత్వ ఐటీఐని అభివృద్ధి చేసే కృషిలో భాగంగా, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో ఆ ఐటీఐకి శాశ్వత భవనాలు ఏర్పడనున్నాయి. అక్కడ అసంపూర్తిగా ఉన్న ల్యాంకో ఫౌండేషన్ భవనాలను ఐటీఐకి ఇచ్చేందుకు వాటి నిర్వాహకులు మంత్రి ఆనం కృషితో అంగీకరించడంతో ఐటీఐ అభివృద్ధికి మార్గం సుగమమైంది. ఆమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం, ఆ ఐటీఐకి లగడపాటి రామానాయుడు పేరు పెట్టాలన్న విషయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, లగడపాటి పేరు కూడా సార్థకం కానుంది. దీంతో ఆ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో పాటు మండల ప్రజలు కూడా సంతోషిస్తున్నారు. ఈ విషయంలో మంత్రి చొరవను ప్రశంసిస్తూ, ఆనంకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## పేద విద్యార్థుల..
# సంక్షేమానికే హాస్టళ్లు!

పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అన్నివిధాలా కృషిచేస్తోందని, సంక్షేమ హాస్టళ్లను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ చెప్పారు. హాస్టళ్లలో ఉంటున్న పేద విద్యార్థుల కోసం పభుత్వం మంచి భోజనం, నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇటీవల ఆయన సంక్షేమశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, హాస్టళ్ల తీరుపై ఆరాతీశారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. ఈ ఏడాది హాస్టళ్ల మరమ్మతులకు ప్రభుత్వం కోట్లాదిరూపాయల నిధులు మంజూరు చేసిందని, ఆ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయని తెలిపారు. సన్నబియ్యంతో అన్నం అందిస్తూ, రుచికరమైన మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారని, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నారని, దీంతో ప్రభుత్వ హాస్టళ్ల రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయని అన్నారు. జిల్లాలో వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ ద్వారా 63 ప్రీమెట్రిక్, 16 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం 4120 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఆ హాస్టళ్లలో వసతి పొందుతున్నారని తెలిపారు. ఇందులో 2373 మంది రెన్యువల్ విద్యార్థులు కాగా, 1654మంది కొత్తగా హాస్టళ్లలో చేరారని, ఇంకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం దాదాపు 550మంది అదనపు విద్యార్థులతో అడ్మిషన్లు పురోగతిలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుని జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ పిలుపునిచ్చారు.

# విద్యార్థులు భక్తిభావంతో ఉండాలి



భక్తిభావమే అందరికీ శ్రీరామరక్ష అని, చిన్నతనం నుంచి ప్రతి విద్యార్థి భక్తిని అలవరచుకోవాలని కోవూరు సమీపంలోని ఇనమడుగులో ఉన్న శ్రీ సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరి తీర్థస్వామి ఉద్బోధించారు. ఆశ్రమ ప్రాంగణంలో జరుగుతున్న భాగవత సప్తాహంలో ఆయన మాట్లాడుతూ, పరమభాగవతోత్తముడైన ప్రహ్లాదుడు కూడా చిన్నవయసు నుంచే భక్తితో ఆ శ్రీమన్నారాయణుని ధ్యానంలో తరించారని తెలిపారు. భాగవత సప్తాహంలో తన ప్రవచనాల్లో భాగంగా ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ ఈనెల 14న 'ప్రహ్లాద చరిత్ర'ను భక్తులకు వివరించారు. శ్రవణం, కీర్తనం, స్మరణం తదితర నవవిధ భక్తిమార్గాల్లో ప్రహ్లాదుడు స్మరణభక్తితో ఆ దేవదేవుని అనుగ్రహానికి పాత్రుడయ్యాడన్నారు. అనంతరం అవధాని రాజశేఖర్‌ను ఆశ్రమం వారు సన్మానించారు. ప్రముఖ స్వామీజీలు శ్రీ పురుషోత్తమ తీర్థ స్వామీజీ, శ్రీరామ తీర్థస్వామీజీ, సత్యానందాశ్రమ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# భారంగా విదేశీ విద్య




**దూరపు కొండలు నునుపు... ఈ సామెత అందరూ వినే ఉంటారు. విదేశీ విద్య మోజు అలాగే ఉంది ఇప్పుడు. మధ్యతరగతి వర్గాల్లో దాదాపుగా ఇంటికొకరు ఉన్నత చదువుల కోసం విదేశాలు వెళ్తున్నారు. నాణ్యమైన ఉన్నత విద్యను అభ్యసించాలన్న ఆకాంక్ష సరైనదే. అయితే ఎంచుకునే విద్యాసంస్థల పట్ల, అక్కడ జీవనశైలి పట్ల సరైన మదింపు చేయకుండానే విదేశాలకు వెళ్లడం వల్ల ప్రయోజనం కన్నా నష్టం ఎక్కువగా జరుగుతోంది. ముఖ్యంగా ఆర్థికంగా ఎన్నో కుటుంబాలు తీవ్రంగా ఒత్తిడికి గురవుతున్నాయి.**

భారతదేశం నుంచి దాదాపు 18 లక్షల మంది విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాలలో నమోదు చేసుకున్నారు. ఇటీవలి అంచనాల ప్రకారం... ట్యూషన్‌ఫీజులు కావచ్చు, ఇతర నిర్వహణ ఖర్చుల కోసం కావచ్చు వీరంతా కలిపి సంవత్సరానికి 10-12 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.85,000 కోట్లు-1,00,000 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అంటే ఇంత మొత్తం డబ్బు మన దేశ ఆర్థిక వ్యవస్థ నుంచి విదేశాలకు మళ్లిపోతున్నట్లే. అంటే మనం గణనీయంగా విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోతున్నాం. ఈ మొత్తం.. అనేక భారతీయ రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌లతో సమానం లేదా అంతకంటే ఎక్కువ. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్ సుమారు రూ.48 లక్షల కోట్లు. అంటే ఉన్నత విద్య కోసం భారతదేశం నుంచి బయటకు వెళ్లిపోతున్న డబ్బు.. జాతీయ బడ్జెట్‌లో దాదాపు 2శాతానికి సమానం. ఈ మొత్తాన్ని మన విద్యాసంస్థల నాణ్యత పెంపు కోసం ఖర్చు పెట్టుకుంటే చాలావరకు విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకోవచ్చు.

### అప్పులు చేసి... చదువుల కోసం దూర దేశాలకు..

నిజంగా మెరుగైన విద్య కోసమే వెళ్తుంటే అది మంచి విషయం. కానీ చాలా మంది ప్రతిష్ట కోసం, తమ బంధువుల్లో, స్నేహితుల కుటుంబాల్లో పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారన్న కారణంతోనో విదేశీ విద్య మోజులో పడుతున్నారు. కుటుంబ ఆదాయం మెరుగ్గా ఉన్నవారి సంగతి ఫర్వాలేదు కానీ, అప్పులు చేసి, కొన్ని సందర్భాల్లో ప్రైవేటు వ్యక్తుల వద్ద ఆస్తులు తాకట్టుపెట్టి ఎక్కువ వడ్డీలకు అప్పులు చేసి తమ పిల్లలను పంపిస్తున్నారు. అలా పంపించేటప్పుడు కూడా ఎటువంటి విద్యాసంస్థలకు పంపిస్తున్నారో సరైన అవగాహన లేకుండానే పంపుతున్నారు. సరైన గుర్తింపు లేని విద్యాసంస్థల్లో విద్యార్థులు చేరి కెరియర్ నాశనం చేసుకుంటున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు రాక, స్వదేశంలో మొహం చూపించలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం, విద్యారంగంలోని మేధావులు ఈ విషయంలో ప్రత్యేకదృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. మన విద్యాసంస్థల నాణ్యతను మెరుగుపర్చుకోవడానికి ఈ ఆధునిక సాంకేతిక యుగంలో చాలా ప్రత్యామ్నాయాలున్నాయి. కృత్రిమ మేధ సాయంతో అంతర్జాతీయ స్థాయి నాణ్యతను ఇక్కడే సమకూర్చవచ్చు. అంతర్జాతీయ స్థాయి బోధకులతో ఒప్పందాలు చేసుకుని ఆన్‌లైన్ కార్యక్రమాలను బోధనలో భాగంగా చేసుకోవచ్చు. భారతీయుల మేధస్సు ఎవరికీ తీసిపోదు. ఒకప్పుడు మనం విశ్వగురువు స్థానంలో ఉన్నాం. ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి చదువుకోవడానికి మన దేశానికే వచ్చేవారు. నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాల నుంచి ఎంతో మంది విజ్ఞానాన్ని సముపార్జించుకుని వెళ్లేవారు. ఆ స్థాయిని మళ్లీ మనం చేరుకోవడానికి అవకాశాలు, మార్గాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ ఆధునిక కాలంలో విదేశాలు మనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయడానికి నిరాకరించినప్పుడు మన విక్రం సారాభాయి, మన అబ్దుల్ కలాం వంటి ఎందరో గొప్ప శాస్త్రవేత్తలు స్వదేశంలోనే గొప్ప పరిశోధనలు చేసి, శ్రమించి విదేశాల కన్నా చౌకగా, మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు. ఒక హాలీవుడ్ సినిమా బడ్జెట్ కన్నా తక్కువ మొత్తంలో మనం రాకెట్ ప్రయోగాలు చేయగల్గుతున్నాం. అటువంటి శాస్త్రవేత్తలంతా భారత్‌లో చదువుకున్నవారే.

### తల్లిదండ్రుల గుండెల్లో ఆందోళన..

ఇక్కడ మరో విషయాన్ని కూడా మనం గుర్తుపెట్టుకోవాలి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల మధ్య ఘర్షణలతో పరిస్థితులు సురక్షితంగా లేవు. కొన్ని దేశాల్లో జాత్యాహంకార దాడులు కూడా జరుగుతున్నాయి. ఇవన్నీ కూడా మన దేశంలో తల్లిదండ్రులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అమెరికాలో అయితే గతంలో పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకునే విద్యార్థులను చూసీ చూడనట్టు వదిలేసేవారు. ఇప్పుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిబంధనలను కఠినతరం చేయడంతో విద్యార్థులకు పార్ట్‌టైం ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో వారి కుటుంబాలపై ఆర్థికభారం మరింత పెరుగుతోంది.

ఇటీవల భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ హైదరాబాద్‌లోని నల్సార్ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ విదేశీ విద్యపై వెలిబుచ్చిన అభిప్రాయం అక్షర సత్యం. చాలామంది న్యాయ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య కోసం రూ. 50లక్షలు - రూ.70 లక్షలు ఖర్చు చేస్తున్నారని, ఇది తల్లిదండ్రులకు భారంగా ఉంటోందని అన్నారు. ఇదే మొత్తంతో ఇక్కడే తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకో వచ్చన్నారు. "విదేశీ డిగ్రీ మాత్రమే మీ విలువకు కొలమానం కాదు... విదేశీ డిగ్రీ కోసం రూ.50-70 లక్షల రుణ భారాన్ని మీపై లేదా మీ కుటుంబంపై మోపవద్దు." అని వారు చెప్పిన మాటలు ఆచరణీయమైనవి.



తుమ్మల బాల గంగాధర్ తిలక్




## నెల్లూరు కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల మహాధర్నా

ప్రభుత్వ ఉద్యోగం చేసిన తర్వాత ఉద్యోగ విరమణ చేసిన అనంతరం పెన్షన్ పొందడం ఉద్యోగుల హక్కు అని.. దానికి ఇప్పుడు కేంద్రప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు, పెన్షన్ వేలిడేషన్ అమెండ్‌మెంట్ పెట్టడం దారుణమని పెన్షనర్లు పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఈనెల 15న నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగిన ఈ మహాధర్నాలో మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఆ సవరణ బిల్లు వల్ల పెన్షనర్లకు అన్యాయం జరుగుతుందని, కనుక వెంటనే దానిని తొలగించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్‌ఓకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు పి.బాబురెడ్డి, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు ఏ.రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె ఖాసీం, కోశాధికారి హజరత్తయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కరేడు భూసేకరణలపై.. కాంగ్రెస్ ఆందోళన

రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవాలంటూ పచ్చని మొక్కలు నాటుకోవాలని చెప్తూ, మరోవైపు పచ్చని చేలున్న భూములను కార్పొరేట్ సంస్థలకి ధారాదత్తం చేస్తోందని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. కరేడులో భూసేకరణలు ఆపాలంటూ, ఈనెల 15న నెల్లూరులోని విఆర్‌సి కూడలి వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా శాఖ ప్రధానకార్యదర్శి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, కందుకూరు నియోజకవర్గంలోని కరేడులో ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను ఆపేయాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు తాము ఆందోళన చేస్తున్నామని తెలిపారు. సీఐటీయు కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ, కరేడు భూములను కార్పొరేట్ వారికి కట్టబెట్టి, గిరిజనుల పొట్ట కొట్టొద్దన్నారు. వెంటనే భూసేకరణ నిలుపుదల చేయాలన్నారు. ఈ నిరసన దీక్షల్లో నెల్లూరు సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నాయకులు మల్లికార్జునరెడ్డి, సుధాకర్‌రెడ్డి, హనీఫ్, సుజాత, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్నకు వ్యతిరేకంగా మహిళల నిరసనలు

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ, ఈనెల 15న విడవలూరులో మహిళలు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. విడవలూరులోని సినిమాహాలు కూడలి వద్ద నుంచి అంకమ్మ దేవాలయం వరకు ర్యాలీ చేపట్టి, అక్కడే మానవహారంగా నిలబడి ప్రసన్నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు చలంచర్ల కామేశ్వరమ్మతో పాటు, టీడీపీ నాయకులు వంశీకృష్ణారెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. మహిళా ఎమ్మెల్యే అయిన ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత దూషణలకు పాల్పడడం దారుణమన్నారు. మాజీ మంత్రిగా, మాజీ ఎమ్మెల్యేగా పని చేసిన ప్రసన్న ఇలా నోటికొచ్చినట్లు మహిళా ఎమ్మెల్యేని దూషించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇకనైనా ఇలాంటి ధోరణి మానుకోవాలని హితవు పలికారు. ఈ ఆందోళనలో మండలంలోని అనేకమంది మహిళలు, మహిళా నాయకురాళ్లతో పాటు మండల టీడీపీ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, ఏటూరు హరిరెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పొన్నలూరు పురంధర్‌రెడ్డి, చెముకుల శ్రీనివాసులు, కొమ్మి శ్రీధర్‌నాయుడు, కుడుముల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# టోక్యో 'ఎక్స్‌పో'లో.. మెరిసిన శ్రీసిటీ



దేశంలోని ప్రముఖ పారిశ్రామిక వాడగా ఉన్న శ్రీసిటీ, జపాన్‌లోని టోక్యోలో ఇటీవల జరిగిన "మ్యానుఫ్యాక్చరింగ్ వరల్డ్-2025"లో పాల్గొని, ప్రపంచ స్థాయిలో ప్రధాన వ్యాపార గమ్యస్థానంగా తన ప్రాధాన్యతను చాటుకుంది. జూలై 9 నుండి 11 వరకు జపాన్‌లోని మకుహారి మెస్సేలో జరిగే ఈ కార్యక్రమం ఆసియా లోనే అతిపెద్ద తయారీ వాణిజ్య ప్రదర్శన కాగా, 75వేల మందికి పైగానే పరిశ్రమల నిపుణులు ఇందులో పాల్గొంటారని అంచనా. ఆర్ఎక్స్ జపాన్ లిమిటెడ్ నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్ (37వ ఎడిషన్)లో ఐటీ సొల్యూషన్స్, మెకానికల్ కాంపోనెంట్స్, మెడికల్ డివైసెస్, సంకలిత తయారీ, సైబర్ సెక్యూరిటీ, స్మార్ట్ మెయింటెనెన్స్ తదితర విభాగాలకు చెందిన 10 ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. తయారీరంగానికి ప్రాధాన్యత కలిగిన ప్రపంచ గమ్యస్థానంగా శ్రీసిటీ ఖ్యాతిని బలోపేతం చేస్తూ వివరణాత్మకంగా తయారు చేసిన మార్కెటింగ్ వీడియోలను శ్రీసిటీ మార్కెటింగ్ బృందం ఇందులో ప్రదర్శించింది. దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా మరియు పలు ప్రత్యేకతలను చాటుతూ, ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ అందరి దృష్టిని ఆకర్షించింది. శ్రీసిటీలోని ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, రవాణా అనుసంధానం, పరిశ్రమలు స్థాపించడం వల్ల కలిగే వివిధ ప్రయోజనాలను శ్రీసిటీ మార్కెటింగ్ అధికారులు గోపీకృష్ణ, కె.బాలాజీ, జపాన్ మాజీ రాయబారి, శ్రీసిటీ సలహాదారు మసనోరి నకానో సందర్శకులకు వివరించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి దీనిపై స్పందిస్తూ, ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు, ముఖ్యంగా తమ జపనీస్ భాగస్వాములకు శ్రీసిటీ ప్రత్యేక బలాలు, పెట్టుబడి అవకాశాలను ప్రదర్శించడానికి ఇలాంటి ప్రదర్శనలు అత్యంత విలువైన వేదికగా ఆయన అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ తయారీ గమ్యస్థానాన్ని నిర్మించాలనే తమ నిబద్ధతను ఇది బలోపేతం చేస్తుందన్నారు. శ్రీసిటీ ఈ ఎక్స్‌పోలో పాల్గొనడం ద్వారా ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడానికి, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడానికి, భారతదేశ తయారీ రంగ అభివృద్ధికి దోహదపడడంలో తమ నిరంతర కృషిని స్పష్టం చేస్తుందని ఆయన తెలిపారు.



# నెల్లూరులో 830 కోట్లతో అభివృద్ధి పనులు

## మంత్రి నారాయణ

నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా మార్చే దిశగా కృషిచేస్తున్నామని, నగర కార్పొరేషన్‌లో రూ. 830 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తమ క్యాంపు కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులతో, నగర టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అటు సంక్షేమం ఇటు అభివృద్ధిని తమ కూటమి ప్రభుత్వం సమపాళ్లలో అందిస్తోందన్నారు. నెల్లూరు నగర కార్పొరేషన్‌లో ఆ పనులన్నీ అక్టోబర్ ఒకటో తేదీ నాటికి ప్రారంభమవుతాయన్నారు. అమృత్ పథకం కింద ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు అందిస్తామన్నారు. ఏడాదిలోపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా పూర్తి చేస్తామని వెల్లడించారు.

నగరంలోని 13 హైస్కూళ్లను డిసెంబర్ కల్లా వి.ఆర్.సి తరహాలోనే ఆధునీకరిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. 9వ డివిజన్లో 22 ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటు చేస్తామని.. అదేవిధంగా అల్లీపురం డంపింగ్ యార్డ్‌లో అన్ని హంగులతో పార్కు ఏర్పాటుచేస్తామన్నారు.

# ప్రజలకు అండగా ఉంటాం

## - సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో, సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు తమ తండ్రి..ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారని, తామెప్పుడూ ప్రజలకు అండగా ఉంటామని సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన ముత్తుకూరు మండలం మల్లూరులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ కూటమి పాలనలో ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవనం సాగిస్తున్నారని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆయన ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు రాజగోపాల్‌రెడ్డిని ఆత్మీయంగా స్వాగతించి, సన్మానించారు.

---

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

## ఎమ్మెల్యే పాశిం సునీల్



సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి అని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గూడూరు మండల పరిధిలోని కొమ్మనేటూరు, చేర్నూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో టీడీపీ హయాంలో తప్ప, ఏ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగలేదన్నారు. అనంతరం ఉచిత గ్యాస్, తల్లికి వందనం, పెన్షన్ పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మట్టం శ్రావణిరెడ్డి, చిన్న వై.ఎస్.ఆర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నిత్యాన్నదానానికి వితరణ



భక్తుల కొంగు బంగారం సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి గూడూరు పట్టణానికి చెందిన సోమిశెట్టి చెంచు రామయ్య రూ. 1,01,116లు వితరణ చేశారు. చెంచురామయ్య తన కుటుంబసభ్యులతో కలిసి ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఈ నెల 13వ తేదీ ఆలయ ఈవో ప్రసన్నలక్ష్మికి అందజేశారు.

# పిఏసిఎస్ ఛైర్మన్‌గా అల్లూరు



గూడూరు నెం. 24 పిఏసిఎస్ ఛైర్మన్‌గా అల్లూరు కరుణాకరరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈయనతో పాటు సభ్యులుగా దువ్వూరు రవీంద్రరెడ్డి, బచ్చల రవీంద్రరెడ్డిలను నియమించారు. పాలకవర్గం ఏర్పాటు కావడంతో సొసైటీలో పాలన గాడిలోపడిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## చిన్నతనం నుండే...

# క్రమశిక్షణను అలవర్చుకోవాలి

## రూరల్ సి.ఐ కిషోర్‌బాబు



చిన్నతనం నుండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని గూడూరు రూరల్ సి.ఐ కిషోర్‌బాబు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈనెల 15వతేదీ గూడూరు సమీపంలోని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ లిటిల్ ఏంజల్స్ అంటే ప్రశాంత వాతావరణంలో ఉన్నత విలువలతో కూడిన విద్యనందించే పాఠశాలగా పేరుందని, ఎన్నికల్లో విజయం సాధించిన లీడర్లు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని విద్యార్థులకు సూచించారు. పిల్లలు చదువులతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి కనపరుస్తుండడం సంతోషదాయకమన్నారు. అనంతరం ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 ఏళ్ళుగా ఎంతోమంది విద్యార్థినీవిద్యార్థులను తీర్చిదిద్దుతున్న పాఠశాల యాజమాన్యానికి సి.ఐ అభినందనలు తెలిపారు. స్కూల్ కరస్పాండెంట్ బస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, అకాడమీ డైరెక్టర్ సుదేష్ణ, దయాకర్‌రెడ్డి, మాస్టర్ సురేష్, వైస్‌ప్రిన్సిపాల్ నంద, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఇటీవల గూడూరులో జరిగిన సామూహిక సత్యనారాయణ వ్రతం కార్యక్రమంలో అన్నప్రసాద వితరణకి సహకరించిన గూడూరులోని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం గూడూరు శాఖ అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్.

# మా సమస్యలు పరిష్కరించండి

## - - మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు - -



రాష్ట్ర ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుండి సిఐటియు నాయకులు నిరవధిక సమ్మెకు శ్రీకారం చుట్టారు. 13వ తేదీ గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సంఘం కార్యదర్శి దారా కోటేశ్వరరావు, పి.భాస్కర్ వై.సుబ్రహ్మణ్యం, కే.బాలయ్య, ఎస్.కామేశ్వరరావు, సి.హెచ్.బాబురావు, మున్సిపల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, సి.ఐ.టి.యు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి. రమణయ్య, అధ్యక్షులు పామంజి మణి, నాయకులు అడపాల ప్రసాద్, నారాయణ, ఏంబేటి చంద్రయ్య పాల్గొన్నారు.

• శ్రీసిటీ టు బెంగళూరు

# ఏసీ స్లీపర్ బస్సు రెడీ!




అంతర్జాతీయస్థాయి గాంచిన పారిశ్రామిక వాడ.. శ్రీసిటీ నుంచి బెంగ ళూరుకు ఏసీ స్లీపర్ బస్సు సర్వీసు ప్రారంభమైంది. ప్రముఖ అంతర్రాష్ట్ర ట్రావెల్ సంస్థ 'గో టూర్ ట్రావెల్స్ అండ్ హాలిడేస్' దీనికి శ్రీకారం చుట్టింది. రాత్రిళ్ళు సౌకర్యవంతమైన ప్రయాణం కోరుకుంటున్న శ్రీసిటీ నివాసితులు, పరిశ్రమ నిపుణులు, ఇతర సందర్శకులు ఎంతో కాలంగా కోరుకుంటున్నట్లుగా, ఈ బస్సు వసతి వారికి బాగా ఉపకరించనుంది. ఈ బస్సు ప్రతిరోజూ శ్రీసిటీ నుండి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి, ఉదయం 5.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు నుండి రాత్రి 9.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.00 గంటలకు శ్రీసిటీ చేరుతుంది. తడ, సూళ్లూరుపేట, నాయుడుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి, చిత్తూరు, కోలార్, హోస్కోట్ దారిలో ఇతర పట్టణాలను కలుపుతూ ఈ బస్సు ప్రయాణిస్తుంది. శ్రీసిటీ వేగవంతమైన అభివృద్ధిని గుర్తించి, గో టూర్ ట్రావెల్ సంస్థ శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద ప్రయాణీకుల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసింది కూడా.

2 రోజులు..

# తపాలా సేవలుండవు

ఆధునిక విధానాలు అమలులోకి

తపాలా శాఖలో ఆధునిక విధానాలు అమలులోకి వస్తున్నాయి. వాటి ద్వారా వినియోగదారులు గతంలోకంటే మెరుగైన సేవలను అందుకోవచ్చు. ఈ క్రమంలో తపాలాశాఖలో ఐటీ 2.0 అప్లికేషన్ విధానం అమలు చేస్తున్నారని, అందువల్ల ఈనెల 21, 22 తేదీల్లో ఇతరత్రా కార్య కలాపాలు జరగవని నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ఈనెల 16న ఒక ప్రకటనలో తెలియజే శారు. ఆ కొత్తవిధానంతో రిజిస్టర్ పోస్టు, కవరు వగైరాలు డెలివరీ ఇచ్చినప్పుడు, బుక్‌చేసిన వ్యక్తికి అప్పటికప్పుడే ఎలాంటి ఆలస్యం లేకుండా మెసేజ్ వస్తుందన్నారు. దీంతో ఉద్యోగులకు పనిభారం తగ్గుతుం దని, వినియోగదారులకు మేలైన సేవలు సులభంగా అందుతాయని వివరించారు.

# నేత్రపర్వం..సాయిబాబా నగరోత్సవం!



గురుపూర్ణిమ మహోత్సవా లను పురస్కరించుకుని నెల్లూరు ట్రంకురోడ్డు సమీపంలోని గాంధీ నగర్‌లో వెలసివున్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు అత్యంత వైభవంగా పూజలు, సేవలు జరిగాయి. ప్రతిరోజూ ఉదయం బాబావారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, మధ్యాహ్నం సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు నిర్వహిం చారు. ఈనెల16న శ్రీ సాయిబాబా నగరోత్సవం సందర్భంగా విద్యుద్దీపాలంకరణలు, విశేష పుష్పాలంకరణలతో గంధర్వ వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి, పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారి నామోచ్ఛారణలు చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా సాయినామంతో మార్మోగింది. అనంతరం కర్పూర నీరాజనాలర్పించి, నగరోత్సవాన్ని ప్రారంభించారు. మంగళవాద్యాలతో, బాణాసంచా వేడుకలతో మందిరం వద్ద నుంచి గాంధీబొమ్మ కూడలి, ఏసీ సెంటర్, సంతపేట, చిన్నబజారు, పెద్దబజారు, బారకాసు కూడలి, విఆర్‌సీ కూడళ్ళ మీదుగా తిరిగి మందిరం వద్దకు నగరోత్సవం నేత్రపర్వంగా..ఎంతో కోలాహలంగా జరిగింది. మందిరం కమిటీ ఛైర్మన్ మన్నెం అమరనాథరెడ్డి, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో వేలాది మంది భక్తులు శ్రీ షిరిడీ సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ ఉత్సవాల ముగింపురోజైన శుక్రవారం (ఈనెల 18)న మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ సాయిబాబా భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# దారి తప్పుతున్న జనసేన

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోకుండా ఆయన అకుంఠిత దీక్షతో ముందుకు సాగారు. శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, కుటుంబ పరంగా ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నారు. అనేక విమర్శలను తట్టుకున్నారు. ఎందరో నాయకులకి ఎదురు నిలబడ్డారు. ఇక పార్టీలోని అతిముఖ్యమైన యువజన విభాగానికి ఆజాద్ పేరును, విద్యార్థి విభాగానికి భగత్ సింగ్ పేరును, మహిళా విభాగానికి వీరనారి ఝాన్సీ లక్ష్మీభాయ్ పేరును పెట్టారు. వారి ఆశయాల సాధన కోసం జనసేన నిత్యం పోరాడుతుందని ప్రకటించారు. తన ఏడు ప్రధాన సిద్ధాంతాల్లో కులాలను కలిపే ఆలోచనా విధానం, మతాల ప్రస్తావన లేని రాజకీయం, భాషలను గౌరవించే సాంప్రదాయం, సంస్కృతులను కాపాడే సమాజం, ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం, అవినీతిపై రాజీలేని పోరాటం, పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం వంటి అంశాల ప్రాతిపదికగా రాజకీయాలు చేస్తుందని వెల్లడించారు.

**అధినేత కష్టాన్ని...**

**గంగపాలు చేస్తున్న నాయకులు**

ఇక పార్టీని ప్రారంభించిన అనంతరం పోరాటాలే ఊపిరిగా పవన్ కల్యాణ్ ప్రజల్లోకి చొచ్చుకెళ్లారు. ఈక్రమంలో ఉద్దానంలో మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు అండగా నిలబడడంతో దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించారు. ఇక అమరావతి రైతులకు భరోసా ఇవ్వడం ద్వారా ఇచ్చిన మాటకు జనసేన కట్టుబడి ఉంటుందన్న విషయాన్ని ప్రజలకు పవన్ స్పష్టంగా వివరించారు. ఇదే క్రమంలో బలవం తపు భూసేకరణను వ్యతిరేకించి ప్రజాపక్షమే తన విధానం అని స్పష్టం చేశారు. ఇక రాష్ట్రంలో అక్రమ మైనింగ్, రిజర్వ్ ఫారెస్ట్‌లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు, కరువు సంబంధిత సమస్య లపై జనసేనాని ఎన్నో నిరసనలను చేపట్టారు. ముఖ్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేసి ఘన విజయం సాధించారు. అయితే కొందరు పార్టీ నాయకులు మాత్రం వ్యక్తిగత వ్యవహారాలను రచ్చ కీడ్చుకుని, తమ పరువునే కాకుండా, పార్టీ ప్రతిష్టను కూడా దిగజారుస్తున్నారు.

**తలనొప్పులు.. తలవంపులతో తలమునకలు**

ఎంతో కష్టపడి రాష్ట్రంలో ప్రస్తుతం రెండో అతిపెద్ద పార్టీ అనే ఘనతను అందుకుని ఏడాదైనా కాకముందే, కొందరు జనసేన నాయకుల వ్యక్తిగత వ్యవహారాలు, వివాదాలు పార్టీలో అలజడికి కారణమవుతున్నాయి. తద్వారా ఏకంగా పార్టీ అధిష్టానమే తల దించుకునే పరిస్థితి నెలకొంటోంది. కొన్ని అంశాల్లో అయితే అధినేత కనీసం ఎలా స్పందించాలో తెలియని దుస్థితి ఏర్పడు తోంది. ఫలితంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులను పార్టీ నుంచి తప్పించి మిన్నకుండిపోతున్నారనే విమర్శలు వ్యక్త మవుతున్నాయి. ముఖ్యంగా సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తన అసిస్టెంట్ అయిన ఓ మైనర్ బాలికను బలవంతంగా లొంగదీసుకోవడమే కాకుండా, అవకాశాలిచ్చే క్రమంలో అత్యా చారానికి సైతం ఒడిగట్టాడనే ఆరోపణలు ఎదుర్కొన్నాడు. చివరికి పోక్సో కేసులో చిక్కుకోవడంతో పార్టీ అధిష్టానమే స్పందించి వివరణ ఇవ్వాల్సి వచ్చింది. అలాగే తిరుపతి జనసేన కీలక నేత కిరణ్ రాయల్‌పై ఓ మహిళ తీవ్ర విమర్శలు చేసింది. కోట్లాది రూపాయలను తన వద్ద నుంచి తీసుకోవడమే కాకుండా తనను వాడుకుని నట్టేట ముంచాడంటూ వాపోయింది. దీంతో ఆ పార్టీ అధిష్టానం అతన్ని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో కిరణ్ రాయల్ సోషల్ మీడియాలో, మెయిన్ స్ట్రీమ్ మీడియాలో అవాకులు చవాకులు మాట్లాడి ప్రజల నుంచి వ్యతిరేకత మూటకట్టుకున్నాడు. అదే తరుణంలో పార్టీకి సైతం చెడ్డపేరు తీసుకొచ్చాడు. తాజాగా శ్రీకాళహస్తి జనసేన ఇన్‌ఛార్జి కోట వినుత, ఆమె భర్త చంద్రబాబు తమ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ యువకుడిని హతమార్చి చెన్నై కూవం నదిలో పడేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. కూటమిలో ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశానికి చెందిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి సైతం ఈ వివాదంలో ఎంతోకొంత పాత్ర ఉందనే విషయం బయటకు రావడం రచ్చరచ్చగా మారింది. ఇదే సమయంలో సనాతన ధర్మం పేరుతో తమిళనాడులో హిందూ వ్యతిరేకులపై పవన్ కల్యాణ్ తీవ్ర విమర్శలు చేయడంతో అక్కడ అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ శ్రీకాళహస్తి యువకుడి హత్య కేసును ప్రతిష్టాత్మ కంగా తీసుకుని జనసేన పరువును మరింత బజారుకీడ్చేలా దర్యాప్తును వేగవంతం చేస్తోందనే వాదనలూ వినిపిస్తున్నాయి.

**మేలుకోకుంటే మొదటికే మోసం..?**

ఇక గత వైఎస్సార్‌సీపీ హయాంలో అంబటి రాంబాబు, అవంతి శ్రీనివాస్‌ను గంట, అరగంట అంటూ సెటైర్లు వేసిన జనసేన నాయకులు జానీ మాస్టర్, వినుత, ఆమె భర్త చంద్రబాబు, కిరణ్‌రాయల్ వ్యవహారాలను ఏ విధంగా చూసీ చూడనట్లు వదిలేస్తారని సోషల్ మీడియా పోస్టులలో నెటిజన్లు దుమ్మెత్తి పోస్తున్నారు. అధినేత పవన్ కల్యాణ్ వీటిపై స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే తన డ్రైవర్‌ను ఎమ్మెల్సీ అనంత బాబు చంపి డోర్ డెలివరీ చేశారని, ఇలాంటి వారా మనకు నాయకులంటూ గతంలో విమర్శలు గుప్పించిన జనసేన అధినేత, వినుత వ్యవహారంలో కిమ్మనకుండా ఉండడం ఏంటని ప్రశ్ని స్తున్నారు. ఈనేపథ్యంలో పార్టీ ఇమేజ్ డ్యామేజ్ కాకుండా వెంటనే ఉపశమన చర్యలు చేపట్టాలని అంతర్గతంగా చర్చ సాగుతున్నట్లు సమాచారం. ఏదేమైనా ప్రజా శ్రేయస్సు, సమస్యల పరిష్కారంలో నిజాయితీ, నిబద్ధతతో పాటు అవసరమైతే విప్లవ పంథాను అనుసరిస్తామని ప్రకటించిన జనసేన అధినేతకు తమ నాయకుల విపరీత పోకడలు తలనొప్పే కాకుండా తలవంపులు సైతం తీసుకొస్తున్నాయడంలో సందేహం లేదు. ఈక్రమంలో దారి తప్పుతున్న సైన్యాన్ని దారిలోకి తెచ్చుకోవడంపై పవన్ కల్యాణ్ దృష్టిసారించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో ఆయన కొన్ని కఠిన చర్యలు తీసుకుని పార్టీని కాపాడుకోకుంటే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించక తప్పదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు....!

టీడీపీ పట్ల..

# తరగని ప్రజాదరణ

పోలంరెడ్డి దినేష్‌రెడ్డి



రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళినా కూటమి ప్రభుత్వం పట్ల, ముఖ్యంగా టీడీపీ అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజల నుంచి ఆదరణ వెల్లువెత్తు తోందని ఏపీ ఇఎంసిఎల్ ఛైర్మన్, ప్రముఖ తెలుగుదేశం నేత దినేష్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన 'సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెలుగు దేశం" కార్యక్రమాన్ని తంబళ్లపల్లి నియోజకవర్గంలోని మొలకల చెరువు మండలం నాయుని చెరువుపల్లి గ్రామంలో నిర్వహించారు. ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరపల్లి జయ చంద్రరెడ్డి, పెద్దసంఖ్యలో కార్యకర్తలు-నాయకులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్ళి ప్రజలకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో బాగున్నాయని, మళ్ళీ మళ్ళీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన చెప్పారు.

అదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

# విద్యార్థులకు కంప్యూటర్లు



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ (ఏకేపీఎల్) మరియు అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న కృష్ణపట్నం హైస్కూలులో18 డెస్క్‌టాప్ కంప్యూటర్లతో కూడిన ఎయిర్ కండిషన్డ్ కంప్యూటర్ సెంటర్‌ను, అన్ని రకాల పరికరాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీని కూడా ఏర్పాటుచేశారు. కృష్ణపట్నంలో హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేశారు. ఏకేపీఎల్ సీఈఓ జగదీష్ పటేల్ సతీమణి చాందిని పటేల్, వారి కుమారుడు యష్‌పటేల్‌తో కలసి స్కూల్‌లో కొత్త పరికరాలను ప్రారంభించారు. విద్యార్థులు ఆ సదుపాయాలను విని యోగించుకోవాల్సిందిగా వారు కోరారు. గ్రామప్రముఖుడు కోదండరామయ్య, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సరళ, విద్యార్థులు ఈ సందర్భంగా అదాని కృష్ణపట్నం పోర్టు వారికి, అదానీ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## వైద్య విధానాల్లో...
# ఆధునిక మార్పులు అవసరం

### ఆపోలో డాక్టర్ ఎం. శ్రావణిరెడ్డి




వైద్య రంగంలో అందివస్తున్న సాంకేతికతపై అవగాహన పెంచుకుని తదనుగుణంగా ముందుకెళ్తే రోగులకు మెరుగైన చికిత్సను అందించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు దోహదపడుతుందని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎం. శ్రావణిరెడ్డి చెప్పారు. పల్మనాలజీ విభాగంలో నేడు మారిన సాంకేతిక చికిత్సా పద్ధతులపై ఆమె ఆదివారం నెల్లూరులో 'ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అప్డేట్-2025 " పేరుతో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ మరియు నెల్లూరుజిల్లా పల్మనాలజీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా పల్మనాలజీ అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ గౌరీనాథ్, డాక్టర్ పిట్టి మల్లిఖార్జునతో పాటు, రాష్ట్రంలోని సుమారు 280మంది వైద్యులు, పీజీ విద్యార్థులు, క్రిటికల్ కేర్ సిబ్బంది కూడా పాల్గొన్నారు. అపోలో హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ సుజాత, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్ వలీ, అపోలో హాస్పిటల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కే.ఆర్.ఆర్.ఉమామహేష్, యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొని తగు సూచనలిచ్చారు.

## అగ్నిబాధితులకు..ప్రశాంతిరెడ్డి సాయం



కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తమ సేవాదృక్పథాన్ని మరోసారి చాటుకున్నారు. విడవలూరు మండలంలోని వరిణి పంచాయతీలోని గిరిజనకాలనీలో ఇటీవల అగ్నిప్రమాదం జరిగి సర్వస్వం కోల్పోయిన బాధితులు అంకులయ్య, శీనమ్మ కుటుంబాలకు 50వేల రూపాయలను ఈనెల 13న మండల టీడీపీ ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి చేతులమీదుగా అందించారు.

## అయ్యోరు సస్పెండ్!

విద్యార్థులు బడికి సక్రమంగా రావాలని చెప్పాల్సిన ఆ ఉపాధ్యాయుడే బడికి తాళం వేసి వెళ్లిపోతే ఆ విద్యార్థుల పరిస్థితేమిటి?.. నెల్లూరుజిల్లా కావలి మండలంలోని లింగంగుంట ప్రాథమిక పాఠశాల అయ్యోరి నిర్వాక మిది. రెండురోజుల పాటు బడికి తాళం వేసి వెళ్లిపోవడం, సిబ్బందిని ఇబ్బందిపెట్టడం వంటి ఘటనలను జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావు విచారించి, కృష్ణ అనే ఆ ఉపాధ్యాయుడిని ఈనెల 16న సస్పెండ్ చేశారు.

## సమాజానికి దిక్సూచీ..సాహిత్యమే!

### పెరసం సభలో వక్తలు



సమాజానికి దిక్సూచీ సాహిత్యమేనని, అందరినీ మంచివైపు నడిపిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేయడం దాని ధ్యేయమని పలువురు వక్తలు చెప్పారు. ఇటీవల నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం(పెరసం) 16వ వార్షికో త్సవం సందర్భంగా, ప్రముఖ సాహితీ వేత్తలు పాయల మురళీకృష్ణ, మిరప మహేష్‌లకు పెరసం నిర్వాహకులు పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రముఖ నవలా రచయిత్రి డా. జయప్రద సోమిరెడ్డి, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు, బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. డా. సుంకర గోపాల్, డా.పెళ్ళూరు సునీల్ పెరసం అవార్డు పొందిన పుస్తకాలను సమీక్షించారు. పెరసం నిర్వాహకులు మోపూరు పెంచల నరసింహం, అవ్వారు శ్రీధర్‌బాబు, గోవిందరాజు సుభద్రా దేవి, తోట సులోచన, అన్నం శివకృష్ణప్రసాద్, నలుబోలు బలరామయ్య నాయుడు సభా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం, కేంద్ర బాల సాహిత్య అవార్డుకు ఎంపికైన డా.గంగిశెట్టిని ఘనంగా సత్కరించారు.



## సమన్వయంతో పనిచేసి..
# ప్రజలకు మేలు చేయాలి

### పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దిశానిర్దేశం

టీడీపీలోని స్థానిక నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి, క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందించాలని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల ఆమె బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని జొన్నవాడ గ్రామంలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్ళి రాష్ట్రంలో తమ కూటమి ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో అస్తవ్యస్తంగా ఉన్న వ్యవస్థలను సరిదిద్దుకుంటూ సీఎం చంద్రబాబు సుపరిపాలన సాగిస్తున్నారని, రాష్ట్రానికి ఆర్థికంగా ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తూ ప్రజలకు మేలు చేస్తున్నారని గుర్తు చేశారు. 'తల్లికి వందనం' డబ్బులు ఇంకా రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికారులు, కూటమి నాయకులు సమన్వయంతో పనిచేసి సచివాలయాల్లో వారి వివరాలు నమోదు చేయించాలని ఆదేశించారు. ఆగస్టు15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారని తెలిపారు. రాష్ట్రానికి పలు కంపెనీలను ఆహ్వానించి స్థానికంగా ఉండే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించ బోతున్నారన్నారు. అర్హులందరికీ త్వరలోనే ఇళ్ళ స్థలాలు కేటాయించేలా ప్రయత్నిస్తామని చెప్పారు. జొన్నవాడ గ్రామంలో 40లక్షల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు.

## ఎన్‌బికెఆర్‌లో ఘనంగా..
# జ్యోతి దినోత్సవం

### విద్యాదాతకు.. ఘన నివాళి



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 15న 90వ జ్యోతి దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాలలోని ఎన్‌బికెఆర్ పార్కులో ఉన్న దివంగత విద్యాప్రదాత, పద్మశ్రీ బాలకృష్ణారెడ్డి విగ్రహానికి కళాశాల సంచాలకులు డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసంస్థలకు బీజం వేసిన రోజును 'జ్యోతి దే'గా ప్రతిఏటా జులై 15న జరుపుకుంటున్నామని తెలిపారు. గతంలో కేవలం ఒక పూరిగుడిసెలో, రాత్రి పాఠశాలతో ప్రారంభమైన ఈ విద్యాలయం, అంచలంచెలుగా ఎదుగుతూ దేశంలోనే మంచి ఖ్యాతిని సంపాదించిందన్నారు. వేలాదిమందికి ఉచితంగా విద్యను అందించిన ఘనత ఆయనదేనని, ఆనాడు భారత ప్రభుత్వం బాలకృష్ణారెడ్డి సేవలను గుర్తించి, ఆయనకు 'పద్మశ్రీ' అవార్డును కూడా అందజేశారని ఆయన గుర్తు చేశారు. ఆ మహనీయుడు మనమధ్య లేనప్పటికీ ఆయన సంకల్పం దిగ్విజయమైందని అన్నారు. ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల్లో చదువుకున్న వేలాదిమంది విద్యార్థులు ఇప్పుడు విదేశాల్లో కూడా ఉన్నత స్థాయిల్లో స్థిరపడి ఉన్నారని తెలిపారు. ఆ సంస్థలో భాగమైన ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల జాతీయస్థాయి విద్యాసంస్థల్లో పోటీపడుతూ ముందం జలో దూసుకుపోతోందన్నారు. ఈ విద్యాసంస్థలు దినదినాభివృద్ధి చెందడానికి, నాణ్యమైన విద్యను అందించడానికి కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఎంతగానో కృషిచేస్తున్నారని కొనియాడారు.

## టూకీగా...

### కోవూరులో రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

రౌడీయిజాలు, కొట్లాటలు మానుకుని బుద్ధిగా ఉంటేనే మీ జీవితాలు బాగుపడతాయని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని కోవూరు ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కోవూరు పరిధిలోని రౌడీషీటర్లను హెచ్చరించారు. ఈనెల 13న వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మంచి ప్రవర్తనతో, సమాజంలో గౌరవంగా బతకాలని చెప్పారు.

### బుచ్చిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 10వ వార్డులో ఈనెల 13న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీటీసీలు చిలకా బాలకుమార్, నాగశాల రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్ళి, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు.

### ఉలవపాళ్లలో 'పొలం పిలుస్తోంది'

దగదర్తి మండలం ఉలవపాళ్ళ గ్రామంలో ఈనెల 15న వ్యవసాయాధికారులు రైతులకోసం 'పొలం పిలుస్తోంది' కార్య క్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డా.కె.కిరణ్ పాల్గొని, రైతులకు సాగుపై సూచనలిచ్చారు. పొలాల్లో రసాయన ఎరువుల వాడకం తగ్గించి, జీవన ఎరువులు వాడడం మంచిద న్నారు. వ్యవసాయ అధికారులు శ్రీజ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### ఇనమడుగులో డెంగ్యూపై అవగాహన

కోవూరు మండలం ఇనమడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి నాగరాజు ఆధ్వర్యంలో ఈనెల 15న సచివా లయం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కలిగించారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతను పాటించాలని చెప్పారు.

### నందవరంలో యువజన నైపుణ్య దినోత్సవం

మర్రిపాడు మండలంలోని నందవరంలో ఈనెల 15న క్రెడ్ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు వాగాల శ్రీహరి ఆధ్వ ర్యంలో ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం జరిగింది. యువజన అధికారి వి.మహేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీనారా యణ, లీడ్‌బ్యాంక్ అధికారి వి.రవిశంకర్ పాల్గొన్నారు. విద్యార్థు లకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులందజేశారు.

### వరిణిలో బాధితులకు రెడ్‌క్రాస్ సాయం

విడవలూరు మండలం వరిణి గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై నిరాశ్రయులైన నాలుగు కుటుంబాల వారికి నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి సూచనలతో, రెడ్‌క్రాస్ ఏఓ చంద్రశేఖర్‌రావు, వలంటీర్లు వెళ్ళి బాధితులను పరామర్శించి, వారికి అవసరమైన టార్పాలిన్ పట్టలు, దోమతెరలు తదితర సామాగ్రిని అందజేశారు.

### బోగోలులో రేషన్‌షాపుల తనిఖీ

బోగోలు మండలం విశ్వనాథరావుపేట, చెంచలక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో ఉన్న రేషన్‌షాపులను కావలి సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ ఎం.విజయమ్మ ఆకస్మిక తనిఖీలు చేశారు. సరుకుల పంపిణీని పరిశీలించి, ధరల పట్టికలు సజావుగా ఉన్నాయా లేదా చూశారు. లబ్ధిదారులకు సరుకులను సక్రమంగా అందించాలని రేషన్‌షాపుల వారికి చెప్పారు.

### పెనుబర్తి వద్ద ఆటోబోల్తా..డ్రైవర్ మృతి

రాపూరు మండలం పెనుబర్తి వద్ద జాతీయరహదారిపై ఈనెల 15వతేదీ ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. గోనుపల్లి నుంచి రాపూరుకు ఆటో నడుపుకుంటూ వస్తుండగా దారిలో ఈ ప్రమాదం జరిగింది. ఆ ఆటో డ్రైవర్..గోనుపల్లికి చెందిన మస్తాన్ అక్కడికక్కడే మరణించగా, ఆటోలోనే ఉన్న మస్తాన్ కుమారుడికి స్వల్ప గాయాలు తగిలాయి.

### సంగంలో పీ-4 పథకంపై సమీక్ష

సంగం ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 15న మండ లంలో అమలవుతున్న పీ-4 పథకాలపై సమీక్షించారు. మండల ప్రత్యేక అధికారి రమేష్ నాయక్, తహశీల్దార్ సోమ్లానాయక్‌లు పాల్గొని, బంగారు కుటుంబాల ఎంపిక పట్ల పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కలిగించారు.

# 'శుభాంశు'..శుభాగమనం!

## ➢ దిగ్విజయంగా అంతరిక్ష యాత్ర
## ➢ క్షేమంగా... భూమికి చేరుకున్న వ్యోమగాములు



అంతరిక్షంలో అద్భుతాలంటే ఇవే. గగనతలంలో సాహసోపేత యాత్రలు చేస్తూ, మానవుడు అంతరిక్షంలోకి వెళ్ళి మళ్ళీ భూమికి తిరిగొచ్చే దృశ్యాలు ఇప్పుడు ప్రపంచాన్ని మరింతగా ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నాయి. ఆ యాత్రలో ముగ్గురు వ్యోమగాములతో కలసి, మనదేశానికి చెందిన శుభాంశు శుక్లా కూడా ఉండడం అందరికీ తెలిసిందే. వారంతా క్షేమంగా తిరిగి భూమి మీదికి రావడం ఒక అపూర్వ సంఘటన. అంతేకాదు, భారత రోదసి చరిత్రలోనే ఇదొక కీలక అంశం. ఈ మానవ సహిత అంతరిక్ష యాత్ర, భవిష్యత్తులో 'గగన్‌యాన్'కి కూడా మార్గం వేయనుండడంతో శాస్త్రవేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్పేస్ ఎక్స్‌కి చెందిన డ్రాగన్ గ్రేస్ వ్యోమనౌకలో వారు అంతరిక్షం నుండి భూమికి తిరిగి ప్రయాణమయ్యారు. గంటకు 28వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న ఆ క్యాప్సూల్ రోదసిలో విన్యాసాలు చేసి, వేగాన్ని తగ్గించుకుని భూవాతావరణంలోకి ప్రవేశించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో పసిఫిక్ మహాసముద్రంలో దిగింది. స్పేస్ ఎక్స్‌కి చెందిన రికవరీ నౌక వారిని సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. శుభాంశు శుక్లా చిరునవ్వులు చిందిస్తూ బయటకు రావడంతో భారతీయుల మనసులు ఆనందంతో నిండాయి.

భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్ళి, అక్కడ 20 రోజులు గడిపి, ఎన్నెన్నో అనుభవాలు, అనుభూతులతో భూమికి తిరిగొచ్చిన శుభాంశు శుక్లాకు భారతీయులు శుభాకాంక్షలు తెలిపారు.

41 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత, 1984లో రాకేశ్ శర్మ రోదసి యాత్ర తర్వాత, ఇప్పుడు భారత పౌరుడు



శుభాంశు శుక్లా.. రోదసి యాత్రను జయప్రదంగా పూర్తిచేసుకుని రావడం దేశానికే గర్వకారణం. వారి రాకను ప్రసారమాధ్యమాల్లో చూసిన ప్రజలంతా ఆనందంతో పులకించిపోయారు. ఈ సందర్భంగా శుభాంశు ప్రజలందరికీ అభివాదం చేస్తూ, చిరునవ్వుతో స్పేస్‌క్రాఫ్ట్ నుంచి బయటకు రావడం ఒక అద్వితీయ ఘట్టం. ఈ వ్యోమగాములంతా అంతరిక్షంలో, ప్రయాణ సమయంతో కలిపి 20 రోజుల పాటు ఉన్నారు. అంతరిక్షానికి సంబంధించి వారు సుమారు 60 అద్భుతమైన పరిశోధనలు చేశారు.

ఈ యాత్ర తర్వాత తిరిగి అమెరికా చేరుకున్న శుభాంశు, వచ్చే నెల 17న భారత్‌కు వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయంటున్నారు. ఏదేమైనా, అంతరిక్షంలో ఉండి అసాధారణమైన, అనన్య సామాన్యమైన ప్రయోగాలెన్నో చేసి, అంతరిక్ష రంగంలో భారత్ కీర్తిని దశదిశలా చాటిన శుభాంశుకు.. జేజేలు!

## అమిత్ షాతో..చంద్రబాబు భేటీ!



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈనెల 15న కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షాని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరు, ఒంగోలు ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, కేంద్రమంత్రులు కింజరపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ పార్లమెంటరీ నేత..ఎంపీ లావు కృష్ణదేవ రాయలు తదితరులు అమిత్‌షాను కలసిన వారిలో ఉన్నారు.

## చిల్డ్రన్స్ పార్కు..సిల్వర్ జూబ్లీ వేడుకలు



నెల్లూరులో చిల్డ్రన్స్ పార్క్ నిర్మించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు సిల్వర్ జూబ్లీ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని, మొక్కలు నాటారు. ఈ పార్కును మరింతగా అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తొలుత, ఈ పార్కు ఏర్పాటుకు కృషిచేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత.. స్వర్గీయ జేఎస్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకురాలు తాళ్ళపాక అనూరాధ మాట్లాడుతూ, తాను మునిసిపల్ ఛైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో ఇక్కడున్న డంపింగ్‌యార్డుని తొలగించి కౌన్సిల్‌లో పార్కుకి ఆమోదం తెలిపామని గుర్తుచేశారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు శ్రీకాంత్‌రెడ్డి, కర్తం ప్రతాప్ రెడ్డి, పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రామ్మూర్తి, పెద పెంచల ప్రసాద్, ట్రెజరర్ ప్రసాద్, కమిటీ సభ్యులు..వాకర్స్ పాల్గొన్నారు.




డా. చిల్లకూరు మోహన్‌రెడ్డి గారు

జననం : 23.06.1936    నిర్యాణం : 22.07.2020

శ్రద్ధాంజలి

నిరంతర సేవాతత్పరులు, నిస్వార్థ ప్రజాసేవకులు,
ఎందరికో స్ఫూర్తిప్రదాతలు, మాకు మార్గదర్శకులు

డా. చిల్లకూరు మోహన్‌రెడ్డి గారు

పరమపదించి తే. 22.07.2025ది నాటికి
ఐదేళ్ళు గడవనున్న సందర్భంగా

ఆ మహనీయుని స్మరించుకుంటూ...

తమ్ముడు - మరదలు
ఆచార్య సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై

తమ్ముని కుమారుడు - కోడలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై

తమ్ముని కుమార్తె - అల్లుడు
శ్రీమతి హరిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ

తమ్ముని మనుమలు.. మనుమరాండ్రు
జయేష్ & అష్మిత    కీర్తన లక్ష్మి & తనవ్


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com